
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
మంగళవారం 11 ఫిబ్రవరి 2025




ఘంటా హనుమయ్య ఛారిటీస్ ధర్మ సత్రం ఉన్న భవనంపై కళ్యాణ మండపాన్ని ఏర్పాటుచేసిన చిత్రం

ధర్మసత్రం.. లేదే లెక్కాపత్రం!

ఒకప్పుడు పేదల ఆకలి తీర్చిన అన్నదాన సత్రాలవి. బాటసారులకు నీడనిచ్చిన వసతి గృహాలు కూడా. దశాబ్దాల కాలంగా ఆకలితో వచ్చిన వారికి పట్టెడన్నం పెట్టడమే ఇక్కడ పరబ్రహ్మ స్వరూపంగా భావించే వారు. ఇదంతా ఒకప్పటి మాట... ఇప్పుడక్కడ అన్నం పెట్టేవారు లేరు. దాతృత్వం చూపేవారూ లేరు. దాన గుణం ఉండాల్సిన ఆ పవిత్ర స్థలాల్లో ఇప్పుడు స్వార్థం రాజ్యమేలుతోంది. దాతల ఆనాటి లక్ష్యం తారుమారై ఈనాడు వ్యాపారమైపోయింది. ఎందరికో నీడనిచ్చి, పట్టెడన్నం పెట్టాల్సిన చోట కాసులు పోగేసుకుని మింగేస్తున్నారు. వీటిని కాపాడాల్సిన దేవదాయ శాఖ అధికారులూ కొంతమంది వారితో చేతులు కలిపి వాటాలేసుకుని మరీ దోచేస్తున్నారు.


సత్రం బయట ఖాళీ స్థలాన్ని బీరువాలు తయారీ వారికి అద్దెకిచ్చిన చిత్రం

దాతలిచ్చిన సత్రాల ఆస్తుల విలువ నేడు రూ. వందల కోట్లు

- పేరుకే దేవదాయ శాఖ ఆధీనంలో...
- అంతా ట్రస్టీల సొంత ఆస్తులన్నట్టు వాటిలో వ్యాపారం
- పేదలకు అన్న'దానం' లేదు... ఆస్తులకు లెక్కాలేదు!
- పరిరక్షించాల్సిన అధికారులకూ వాటాల ఆశలు!
- సదావర్తి భూముల వ్యవహారం ఒక అనుభవం అయినా... కళ్లు తెరవని దేవదాయ శాఖ

తెనాలి, ఫిబ్రవరి 10, (ఆంధ్రజ్యోతి): వందల సంవత్సరాల క్రితం స్థలాలు, భవనాలు దానమిచ్చిన దాతల ఆశయానికి నిలువునా తూట్లు పొడుస్తున్నారు. ఎన్నో సంవత్సరాల క్రితం ఇచ్చిన స్థలాలు ఇప్పుడు మంచి వ్యాపార కూడళ్ళవడం, ఉచితంగా ఇచ్చిన స్థలాల విలువ అమాంతం పెరిగిపోయి రూ. వందల కోట్లు పలుకుతుండటంతో కొంతమంది వాటిని సొంత ఆస్తుల తరహాలో అమ్మేసుకుంటున్న దారుణ పరిస్థితులు ఉన్నాయంటే అతిశయోక్తికాదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వందల సంఖ్యలో ఇటువంటి అన్నదాన సత్రాలున్నాయి. వీటిలో చాలావరకు పట్టణాల్లోని ప్రధాన కూడళ్ల, వ్యాపార అనుకూల ప్రాంతాల్లో ఉండటం, అత్యంత ఖరీదైన స్థలాలున్న ప్రదేశాల జాబితాలోకి చేరటంతో నిన్నటి వరకు సత్రాల కార్యకలాపాలు సాగించిన ట్రస్టీలకు ఆశపెరిగిపోయి, సేవ చెయ్యాల్సినచోట వ్యాపారం చేసేస్తున్నారు. ఉన్న దుకాణాలను భారీ మొత్తంలో అద్దెలకిచ్చి, లెక్కల్లో మాత్రం తక్కువ చూపటం, సత్రాల ఖాళీ స్థలాలను సొంతగా అద్దెలకివ్వటం, వచ్చిన డబ్బును దేవదాయ శాఖ ఖాతాలో కాకుండా సొంత ఆస్తిలాగా జేబులో వేసుకోటం పరిపాటిగా మారింది. మరి కొన్నిచోట్లయితే సొంత (మిగతా 8వ పేజీలో)


బుర్రిపాలెం రోడ్డులోని బర్తిపూడి రామయ్య అన్నపూర్ణమ్మ ధర్మ సత్రం భవనం దుస్థితి

తెనాలిలో యడ్లపల్లి కోటిలింగం ధర్మ సత్రం బోస్‌రోడ్డులో ఉంది. దీని కింద 2 ఎకరాల భూమి, షాపులు ఆస్తిగా ఉన్నాయి. వీటిపై వచ్చే ఆదాయంతో ప్రతి సంక్రాంతికి 100 మంది జంగమ మహేశ్వరులకు బియ్యం దానం చేయాలి. ఇక్కడ అపర కర్మలకు అవకాశం ఇవ్వాలి. అయితే ఇది కొంత వరకు జనానికి ఉపయోగపడుతోంది. పట్టణంలో అద్దె ఇళ్లలో ఉండేవారికి అపరకర్మలకు ఇదే ఆధారం. అయితే ఆదాయ వ్యయాల లెక్కలు మాత్రం గుట్టుగా ఉంచుతారనే విమర్శ ఉంది.

మిర్చియార్డు వద్ద.. ట్రాఫిక్ కష్టాలకు చెక్

- 1.6 కిలోమీటర్ల పొడవునా ఫ్లైవోవర్ నిర్మాణం
- ఊపందుకున్న పనులు
- రూ. 27.28 కోట్లు కేటాయించిన ఎన్‌హెచ్ఏఐ

గుంటూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరం నుంచి అనంతపురం, హైదరాబాద్ వెళ్లేందుకు ప్రధాన మార్గమైన పేరేచర్ల మార్గంలో జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) ఫ్లైవోవర్ బ్రిడ్జీ నిర్మాణ పనులను ప్రారంభించింది. ఎన్‌డీఏ-2 ప్రభుత్వ హయాంలోనే రోడ్డు భద్రత వర్కుల కింద ఈ పని మంజూరు కాగా రహదారి విస్తరణ పనుల్లో జాప్యం కారణంగా సకాలంలో పూర్తి కాలేకపోయాయి.


యార్డు వద్ద ప్రారంభమైన ఫ్లైవోవర్ పనులు



వాస్తవానికి ఈ ఏడాది జనవరి నెలలోనే ఈ ఫ్లైవోవర్ నిర్మాణం పూర్తి చేసేందుకు లక్ష్యంగా నిర్దేశించుకున్నామని పలుమార్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పార్లమెంట్‌లో ఎంపీలు అడిగిన ప్రశ్నలకు సమాధా నంగా చెప్పారు. ఎట్టకేలకు ఇటీవలే ఎన్‌హెచ్ఏఐ పనులను ప్రారంభించింది. ఈ ఫ్లైవోవర్ నిర్మాణం పూర్తి అయితే యార్డు వద్ద ట్రాఫిక్ కష్టాలు తొలగి పోతాయని ఎన్‌హెచ్ఏఐ వర్గాలు చెబుతున్నాయి.

అనంతపురం - గుంటూరు రహదారి గతంలో స్టేట్ హైవేగా ఉండేది. దీనిని ఎన్‌హెచ్ఏఐ తీసుకొని పేరు కూడా ఎన్‌హెచ్-544డీగా పెట్టింది. యార్డు ఈ మార్గంలోనే ఉంది. దీని వలన ఏటా జనవరి మొదలుకొని మే నెల వరకు ట్రాఫిక్ స్తంభించిపోతు న్నది. ఇందుకు ప్రధాన కారణం కర్ణాటక రాష్ట్రంతో పాటు రాయలసీమ, ప్రకాశం, పల్నాడు, తెలంగాణలోని కొన్ని ప్రాంతాల నుంచి రైతులు పండించిన మిర్చిని అమ్ముకోవడానికి ఇక్కడికి లారీలు, ఆటోలలో తీసుకొస్తుండటమే. కొన్ని సందర్భాల్లో మిర్చియార్డు మొదలుకొని చుట్టుగుంట వరకు కూడా మిర్చి టిక్కీలతో వచ్చిన లారీలు యార్డులోకి ప్రవేశించేందుకు నిరీక్షించాల్సిన పరిస్థితి. దీని వలన ట్రాఫిక్ సమస్యతో పాటు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక రోజులో పూర్తి కావాల్సిన ట్రేడింగ్ మూడు, నాలుగు రోజుల సమయం పడుతున్నది. ఈ విషయాన్ని ఎంపీలు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ఇక్కడ ఫ్లైవోవర్ నిర్మిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయనే నిర్ణయానికి వచ్చి మంజూరు చేసింది.

యార్డుకు చుట్టుగుంట వైపునకు 800 మీటర్లు, హౌసింగ్ బోర్డు కాలనీ వైపునకు 800 మీటర్లు కలిపి 1.6 కిలోమీటర్ల పొడవునా ఈ ఫ్లైవోవర్ బ్రిడ్జీని ఎన్‌హెచ్ఏఐ నిర్మాణం చేపట్టింది. ప్రస్తుతం ఇరువైపుల డ్రెయిన్ టూ డ్రెయిన్ వరకు విస్తరించిన రహదారిని లెవలింగ్ చేస్తున్నది. మరోవైపు వంతెనల విస్తరణ పనులు నల్లకుంట, హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద చేపట్టింది. కేంద్రం ప్రభుత్వం ఈ ఫ్లైవోవర్ కోసం రూ. 27.28 కోట్లను మంజూరు చేసింది. ఇంజనీరింగ్ ఈపీసీ పద్ధతిలో ఏజెన్సీని ఖరారు చేసింది. ప్రాజెక్టు 2022- 23 ఆర్థిక సంవత్సరంలో మంజూరు కాగా 18 నెలల కాల వ్యవధిని పెట్టుకొని 2025 జనవరి కల్లా పూర్తి చేస్తామని ప్రకటించింది. అయితే అనివార్య కారణాలతో పనుల్లో జాప్యం తలెత్తింది. ఇప్పుడు ఎలాంటి ఆటంకాలు లేకపోవడంతో పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి.

ఆర్టీసీలో.. డొక్కు బస్సులు


జీటీ రోడ్డులో ఇటీవల రోడ్డుపై ఆగిపోయిన చిలకలూరిపేట డిపో పల్లె వెలుగు బస్సు

- ప్రయాణం మధ్యలో ఆగిపోతున్న వైనం
- వైసీపీ పాలనలో ఒక్క బస్సూ కొనని వైనం
- ఉమ్మడి జిల్లాలో 60 శాతంపైనే పనికి రానివి

గుంటూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క కొత్త బస్సు కొనకపోవడంతో, దాని పర్యవసాన పరిస్థితులు నేడు ఆర్టీసీని వెంటా డుతున్నాయి. ప్రయాణీకులతో రాకపోకలు సాగించే బస్సులు మార్గమధ్యంలో అర్థాంతరంగా నిలిచిపోతు న్నాయి. ఇటీవల వరుసగా బస్సులు మొరాయిస్తుం డటంతో ప్రయాణీకుల్లో తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. తాజాగా గుంటూరు జీటీ రోడ్డులో గుండారావుపేట వద్ద ఇటీవల గుంటూరు - చిలకలూరిపేటకు రాకపోకలు సాగించే చిలకలూరిపేట డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు అర్థాంతరంగా నిలిచిపోయింది. డ్రైవర్ ఎంత ప్రయత్నించినా బస్సు ముందుకు కదలక పోవటంతో అందులోని ప్రయాణీకులను వేరొక బస్సులో చేర్పించి గమ్యస్థానాలకు చేర్చాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఇదే విధంగా ఇటీవల కొన్ని రోజుల కిందటే జీటీ రోడ్డులోనే గుంటూరు నుంచి పిడుగురాళ్ళ వెళుతోన్న బస్సు కూడా మార్గం మధ్యలో మొరాయించింది. అర్థాంతరంగా నిలిచి పోవటంతో డ్రైవర్ సదరు బస్సులోని ప్రయాణీకులను మరో బస్సులోకి ఎక్కించారు. ఇదిలా ఉంటే ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 980కుపైగా బస్సులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వీటిలో గుం టూరు-1, 2 డిపోలతో పాటు తెనాలి, మంగళగిరి, పొన్నూరు, బాపట్ల, రేపల్లె, నరసరావుపేట, చిలకలూ రిపేట, మాచర్ల, వినుకొండ డిపోలలో బస్సులు 60 శాతం పైన డొక్కు బస్సులే ఉన్నట్లు ఆర్టీసీ వర్గాలే చెబు తున్నాయి. వాస్తవానికి 12 లక్షల కిలోమీటర్లు ప్రయా ణించిన బస్సులను తుక్కు కింద పరిగ ణించాల్సి ఉంటుంది. అటువంటి ఆర్టీసీ యంత్రాంగం ఆయా నిబంధనలు పాటించటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

నిబంధనల మేరకు తిరగాల్సిన కిలో మీటర్ల కంటే అదనంగా తిరిగిన పల్లె వెలుగు బస్సులు కూడా నేటికీ ప్రయాణీకులతో రాకపోకలు సాగిస్తు న్నాయన్న విమర్శలున్నాయి. దాంతో మార్గమధ్యంలో ఎక్కడ మొరాయిస్తాయో తెలియని పరిస్థితులు నెలకొ న్నాయి. నిబంధనల ప్రకారం బస్సుల్లో రిపేర్లు వస్తే మరమ్మతుల నిర్వహణ కోసం ఉంచాల్సిన పరికరాలు (టూల్స్ కిట్‌లు) కూడా ఉండటం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో బస్సులు ఆగిపోతే సదరు డిపోల నుంచి గ్యారేజ్ సిబ్బంది వెళ్ళి మరమ్మతులు చేయాల్సి పరిస్థితులు ఉంటున్నాయని ఆర్టీసీ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డొక్కు బస్సుల స్థానంలో..

తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త బస్సుల కొనుగోలు ప్రక్రియ చేపడుతోంది. ఆర్టీసీ సొంతంగా కొనుగోలు చేయటంతో పాటు అద్దె బస్సులను కూడా వినియోగించు కునేందుకు ప్రణాళికలు చేపడుతున్నారు. అంతేగాక పర్యావరణ పరిరక్షణంలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాలు కూడా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో డొక్కు బస్సుల స్థానంలో కొత్త బస్సులు, కనీసం అద్దె బస్సులునైనా ఏర్పాటు చేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

ఇసుక ధరకు రెక్కలు

టన్ను రూ. 1100

- వారం రోజుల్లో టన్నుకు రూ 500 పెరుగుదల
- అధికారిక ఇసుక రీచ్‌ల నిలిపివేత
- అడ్డగోలుగా కృష్ణానదిలో ఇసుక తవ్వకాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలకు ఈ నెల ఆరో తేదీతో అనుమతులు ముగిసాయి. దీంతో అధికారిక రీచ్‌లను మైనింగ్ శాఖ మూసివేసింది. ఇదే అదనుగా అక్రమార్కులు ఇసుక దందాకు తెర లేపారు. అర్ధరాత్రులు కృష్ణా నదిలో ఇసుక తవ్వి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. దీంతో ఇసుక ధరకు రెక్కలు వచ్చాయి. టన్ను ఇసుక రూ. 1100కు విక్రయిస్తున్నారు. వారం రోజుల్లో టన్ను ఇసుకకు రూ. 500 వరకు ధర పెరిగింది. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇసుక విధానానికి అక్రమార్కులు తూట్లు పొడుస్తున్నారు. పెద్ద ఎత్తున అక్రమ మైనింగ్ జరుగుతున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు.

ఇసుక కోసం వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. మైనింగ్ శాఖ ఇసుక సరఫరా చేసే పరిస్థితి లేకపోవడంతో



వారు బ్లాక్ మార్కెట్‌పై ఆధారపడుతున్నారు. నరసరావుపేటలో సోమవారం టన్ను ఇసుక రూ. 1100కు విక్రయించారు. అధికారిక తవ్వకాలు లేకపోవడంతో, ఇసుక ధర మరింత పెరగవచ్చని తెలుస్తోంది. వారం రోజుల క్రితం టన్ను ఇసుక రూ. 550 నుంచి 600 వరకు లభించింది. అమాంతం ఇసుక ధర పెరగడంతో నిర్మాణ దారులు గుడ్లు తేలేస్తున్నారు. ముందుగా ఆర్డర్ చేస్తే చాలు చెప్పిన చోటుకు ఇసుక సరఫరా చేస్తున్నారు. అక్రమార్కులు మాత్రం ఎన్ని టన్నులు కావాలన్నా పుష్కలంగా ఇసుక సరఫరా చేస్తున్నారు. ఒక్కొక్క లారీకి 30 నుంచి 35 టన్నుల వరకు లోడ్ చేస్తున్నారు. ఇసుక ఇక్కట్ల కారణంగా నిర్మాణాలు నిలిచిపోయి కార్మికుల ఉపాధికి గండి పడుతోంది. ప్రభుత్వం వెంటనే స్పందించి, అధికారిక రీచ్‌లను ప్రారంభించి ఇసుక సరఫరా మెరుగు పరచాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఏసీబీ వలలో.. చిలకలూరిపేట ఎంఈవో


ఎంఈఓ లక్ష్మీ
జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు

- ఉపాధ్యాయుడి నుంచి రూ. 30 వేలు డిమాండ్
- రెడ్ హ్యాండెడ్ దొరికిన వైనం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం విద్యాశాఖ అధికారి (ఎంఈఓ-1) కె లక్ష్మీ లంచం తీసుకుంటుండగా సోమవారం ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. లంచం ఇచ్చిన జూనియర్ అసిస్టెంట్ మాజేటి శ్రీనివాసరావును కూడా ఆమెతోపాటు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి గుంటూరు ఏసీబీ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఆర్‌వీఎస్ సీవీఎస్ హైస్కూల్లో చల్లా వెంకట శ్రీనివాసరావు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా (స్కూల్ అసిస్టెంట్) గా పనిచేసి గత జూలైలో పదవీ విరమణ చేశాడు. గత కొంత కాలంగా పెన్షన్‌తో సహా అతడికి రావాల్సిన పదవీ విరమణ ప్రయోజనాలు ఇవ్వడానికి ఎంఈఓ లక్ష్మి లంచం డిమాండ్ చేస్తూ వచ్చింది. సంబంధిత ఫైలును చిలకలూరిపేట సబ్ ట్రెజరీ కార్యాలయానికి పంపకుండా కాలయాపన చేస్తున్నది. దీంతో బాధితుడు చల్లా వెంకట శ్రీనివాసరావు ఈ విషయాన్ని ఏసీబీ అధికారులకు తెలిపాడు. తాను పనిచేసిన విద్యాసంస్థలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉన్న మాజేటి శ్రీనివాసరావు ద్వారా రు. 30 వేలు ఎంఈఓ లక్ష్మికి పంపారు.

ఎంఈఓ ఇంటి వద్దనే మాజేటి శ్రీనివాసరావు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు మెరుపు దాడి చేసి పట్టుకున్నారు. వీరిద్దరిని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. అధికారులు వీరిని విజయవాడ ఏసీబీ ప్రత్యేక న్యాయ స్థానంలో హాజరు పరచనున్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను లంచం కోసం ఎవరైనా వేధించినట్లయితే జిల్లా ఏసీబీ అధికారులకు గాని, ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064కు గాని, 94404 40057కు గాని తెలియపరచాలని ఏసీబీ అధికారులు కోరారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీకి.. ముగిసిన నామినేషన్లు

- 43 మంది అభ్యర్థులు 69 నామినేషన్ల దాఖలు
- చివరి రోజున నామినేషన్ వేసిన 22 మంది
- నేడు గుంటూరు కలెక్టరేట్‌లో పరిశీలన

గుంటూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం ద్వైపాక్షిక ఎన్నికలకు నామినేషన్ల ఘట్టం ముగిసింది. నామినేషన్ల దాఖలుకు గడువు తేదీ అయిన ఈ నెల 10 (సోమవారం) ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులు గుంటూరు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. అభ్యర్థులు వారి వెంట వచ్చిన మద్దతుదారులతో కలెక్టరేట్ ప్రాంగణంలో కోలాహలం నెలకొన్నది. చివరి రోజైన సోమవారం మొత్తం 22 మంది అభ్యర్థులు 43 నామినేషన్లను దాఖలు చేశారు. దీంతో ఫారం- 3లను అప్‌లోడింగ్ చేయడానికి రాత్రి 8 గంటల వరకు పట్టింది. నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో ఈ నెల 11వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అభ్యర్థుల సమక్షంలో నామినేషన్ల పరిశీలన చేపడతారు.


నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళుతున్న లక్ష్మణరావు

ఈ నెల 3వ తేదీన ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడగా ఆ రోజు నుంచి నామినేషన్ల స్వీకార ప్రక్రియ ప్రారంభమైంది. మొత్తంగా 40 మంది అభ్యర్థులు 69 నామినేషన్లను దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి గుంటూరు కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తెలిపారు. ప్రధాన అభ్యర్థుల్లో ఒకరైన ఆలపాటి రాజేంద్రప్రసాద్ తరుపున ఆయన సతీమణి మాధవి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. చివరి రోజున సిట్టింగ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ర్యాలీగా వచ్చి పీడీఎఫ్ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్సీలతో కలిసి నామినేషన్ వేశారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్న ఉపాధ్యాయులు

కృష్ణా - గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం ఎన్నికల్లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు యథేచ్ఛగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తున్నారు. వేర్వేరు ఉపాధ్యాయ సంఘాల్లో ఉన్న నాయకులు రాజకీయ పార్టీలతో అనుబంధంగా ఉంటున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని తెలిసి కూడా అభ్యర్థుల వెంట ర్యాలీలు, ఆత్మీయ సమావేశాలకు హాజరవుతున్నారు. కొంత మంది ఉపాధ్యాయులైతే పాఠశాలలకు సెలవులు పెట్టి మరీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. నామినేషన్ల ప్రక్రియలో తలమునకలై ఉన్న ఎన్నికల యంత్రాంగం కోడ్ అమలును పట్టించుకోవడం లేదు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుకు నోడల్ అధికారుల నేతృత్వంలో బృందాలను నియమించినా అవి సక్రమంగా పని చేయడం లేదు. అభ్యర్థుల నామినేషన్ల దాఖలును రికార్డింగ్ చేస్తున్న వీడియోలను ఒకసారి పరిశీలిస్తే అవలీలగా కోడ్ ఉల్లంఘించిన ఉపాధ్యాయులను గుర్తించొచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా జనరల్ ఎలక్షన్స్ వలే ఎన్నికల కోడ్ అమలులో ఉన్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఏ ఉద్యోగి అయినా అభ్యర్థులకు మద్దతుగా ర్యాలీలు, ప్రచారాల్లో పాల్గొనరాదు. అయితే నిఘా లేకపోవడంతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు కొందరు నామినేషన్లు, ర్యాలీల్లోనూ పాల్గొంటున్నారు.


ఆలపాటి రాజా తరపున మరో సెట్ నామినేషన్ వేస్తున్న ఆయన సతీమణి మాధవి

నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ తప్పనిసరి

- వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండ్యన్
- ఉర్దూ బాలుర పాఠశాలలో మాత్రల పంపిణీ

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు, పిల్లల్లో నులిపురుగుల నివారణ కోసం సంవత్సరం నుంచి 19 ఏళ్ల వయస్సు లోపు వారికి ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి.వీరపాండ్యన్ తెలిపారు. సోమవారం గుంటూరు పాతబస్టాండ్ సెంటర్‌లోని ప్రభుత్వ ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. లబ్ధిదారులైన పిల్లలు, యువతీ, యువకులతో ఆల్బెండజోల్ మాత్రలను ఏక కాలంలో ఒకేరోజు మింగిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఏడాదిలో రెండు సార్లు వీటిని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో అమలు చేస్తున్నామని ఆయన వివరించారు. ఉపాధ్యాయులతో పాటు అంగన్‌వాడీ వర్కర్లు ఈ కార్యక్రమంలో పిల్లల చేత మాత్రలు మింగిస్తారని తెలిపారు. ఈ మాత్రలు పిల్లల్లో నులిపురుగులను నిర్మూలిస్తాయన్నారు. ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోకపోతే పిల్లల్లో రక్తహీనత, ఎదుగుదల లోపాలు కనిపిస్తాయని చెప్పారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన 4,24,742 మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వీరిలో ఏడాది నుంచి రెండేళ్లలోపు పిల్లలకు అర మాత్ర కరిగించి తాగించాలన్నారు. మూడేళ్ల నుంచి 19 ఏళ్ల వారి వరకు పూర్తి మాత్ర చెప్పరించి లేదా నమిలి మింగించాలని తెలిపారు. అనంతరం రాష్ట్ర బాల ఆరోగ్య రక్ష కార్యక్రమ్ (ఆర్‌బీఎస్‌కే) స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ ప్రశాంత్, ఈ సందర్భంగా విద్యార్థులతో చేతుల పరిశుభ్రతపై డెమాన్‌స్ట్రేషన్ చేయించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ్, జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక, మండల విద్యాశాఖాధికారి ఖుద్దూస్, ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎస్ రోహిణి రత్నశ్రీ, డాక్టర్ ఏ శ్రావణ్‌బాబు, డాక్టర్ సీహెచ్ రత్నమన్మోహన్, డాక్టర్ గుణశ్రీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసుంధరా దేవి పాల్గొన్నారు.


విద్యార్థినితో మాత్ర మింగిస్తున్న కమిషనర్ వీరపాండ్యన్

ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ పూర్తి కావాలి: కలెక్టర్

నరసరావుపేట కల్చరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) జిల్లాలో ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియ పూర్తి కావాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ లెవల్ ఆధార్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ 0-5 సంవత్సరాల ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ పూర్తి కావాలని, 15 నుంచి 17 సంవత్సరాల మాండేటరి బయోమెట్రిక్ పెండింగ్స్ కంప్లీట్ చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 107 ఆధార్ కిట్లు ఉంటే వాటిలో 67 ఆధార్ కిట్లు వివిధ మండలాల్లో పనిచేస్తున్నాయని చెప్పారు. మిగతా 44 కిట్లు కొన్ని హార్డ్‌వేర్ సమస్యలు ఉండటం వలన పనిచేయడం లేదని తెలిపారు. కాగా వాటిని పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ప్రతి ఆధార్ కేంద్రంలో సేవలకు సంబంధించి ప్రైస్ చార్ట్‌ను విధిగా డిస్‌ప్లే చేయాలన్నారు. జిల్లా జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి ఎం.వెంకటరెడ్డి, జిల్లా ఆధార్ కోఆర్డినేటర్ ఎం.రమేష్‌లకు క్షేత్రస్థాయిలో అధికారులు సహకరించాలని ఆదేశించారు.

లక్ష్మణరావు విజయం చారిత్రక అవసరం

- పీడీఎఫ్ ఎమ్మెల్సీ, ప్రజా సంఘాల నాయకులు
- నగరంలో భారీ ర్యాలీతో నామినేషన్ దాఖలు

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): శాసన మండలిలో సామాన్య ప్రజల గొంతుక వినిపించడానికి ఎమ్మెల్సీగా కేఎస్ లక్ష్మణరావు గెలుపు చారిత్రక అవసరమని పీడీఎఫ్ ఎమ్మెల్సీలు, ప్రజా సంఘాల నాయకులు స్పష్టం చేశారు. కృష్ణా,గుంటూరు ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీడీఎఫ్ తరపున కేఎస్ లక్ష్మణరావు నామినేషన్ సందర్భంగా సోమవారం వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వక్తలు మాట్లాడారు. సభకు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. మాజీ ఎమ్మెల్సీ విటపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో గత 14 ఏళ్ల కాలంలో 18 మంది పీడీఎఫ్ ఎమ్మెల్సీలు పనిచేశారని, ఎక్కడ ఎవరిపైనా ఎటువంటి అవినీతి ఆరోపణలు రాలేదన్నారు. నిజాయితీగా ప్రజల తరపున పోరాటం చేయడమే తప్ప మరో అంశం తమ దృష్టిలో ఉండదన్నారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీలు మండలిలో ఉండబట్టే గత ప్రభుత్వం తీసుకు వచ్చిన మూడు రాజధానుల బిల్లును ఓడించామన్నారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు ప్రసంగిస్తూ లక్ష్మణరావు తన జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేశారన్నారు. ఎమ్మెల్సీ బి గోపి మూర్తి ప్రసంగిస్తూ ప్రస్తుత వైసీపీ వారు శాసన సభకు వెళ్లడం లేదని, అధికార పక్షం ఏకపక్షంగా తీర్మానాలు చేసుకుంటుందని, ఇలాంటి సమయంలో ప్రజల కోసం మాట్లాడే పీడీఎఫ్ ఎమ్మెల్సీల గెలుపు ఎంతో అవసరం అన్నారు. జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ గతంలో 100 రోజులకు పైగా జరిగే శాసనసభ సమావేశాలు ఇప్పుడు 20 రోజులు కూడా జరగడం లేదన్నారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు ప్రధాన ప్రతిపక్షమే రావడం లేదన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఈసారి ఎన్నికల్లో తనకు ఊహించని ఆదరణ ఉందని ధీమా వ్యక్తం చేశారు. రాజ్యాంగ నిర్మాతలు పట్టభద్రులు, ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా మండలిలో కొన్ని స్థానాలు కేటాయిస్తే వీటిల్లోకి రాజకీయ పార్టీలు పోటీ చేయటం వలన ప్రజలకు మేలు జరగదన్నారు.


ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు, బాలసుబ్రమణ్యం

నగరంలో భారీ ర్యాలీ....

కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి ఈ నెల 27వ తేదీన జరగనున్న శాసన మండలి ఎన్నికలకు పీడీఎఫ్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్సీ కె.ఎస్ .లక్ష్మణరావు సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, ఆధ్యాపక, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, కార్మిక, కర్షక, మహిళా ప్రజా సంఘాల ప్రతినిధులు భారీ ర్యాలీగా తరలివచ్చి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. వామ పక్షాల కళాజాత ఆకట్టుకుంది. స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించిన భారీ ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి కె. రాములు, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఎ. చిస్తి, ఐలూ రాష్ట్ర నాయకులు నర్రా శ్రీనివాసరావు, రమేష్, ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు నాగయ్య, వివిధ ప్రజా సంఘాల నాయకులు సుబ్బారావమ్మ, ధనలక్ష్మి, కుమార్, స్వాతీ, యూటీఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్స్ యూనివర్సిటీకి జాతీయ స్థాయిలో ఏఏ గ్రేడ్


అధ్యాపకులను అభినందిస్తున్న పి.నాగభూషణం

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీకి ఐఐటీ మద్రాస్ విడుదల చేసిన జాతీయస్థాయి స్వయం ఎన్‌పీటీఈఎల్ ర్యాంకింగ్స్‌లో 'ఏఏ గ్రేడ్' లభించిందని యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ సోమవారం తెలిపారు. స్వయం ఎన్‌పీటీఈఎల్ విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో జాతీయస్థాయిలో 100లోపు ర్యాంక్ సాధించి "ఏఏ గ్రేడ్"ను సొంతం చేసుకుందన్నారు. ఎన్‌పీటీఈఎల్ నిర్వహించిన వివిధ రకాల కోర్సులలో విజ్ఞాన్స్ యూనివర్సిటీకు చెందిన విద్యార్థులు పాల్గొని 2814 కోర్సు సర్టిఫికెట్లు సాధించారన్నారు. "ఏఏ గ్రేడ్" సాధించడానికి కృషి చేసిన టీం సభ్యులను విజ్ఞాన్స్ యూనివర్సిటీ సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు అభినందించారు.

ఆర్‌వీఆర్ అండ్ జేసీకి జాతీయ స్థాయిలో ఏఏ రేటింగ్


సర్టిఫికెట్లు అందుకుంటున్న కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎన్‌పీటీఈఎల్ పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు కనబరిచిన విశేష ప్రతిభకు ఆర్‌వీఆర్ అండ్ జేసీ కళాశాలకు మద్రాస్ ఐఐటీ నుంచి జాతీయ స్థాయిలో ఏఏ ర్యాంకింగ్ వచ్చినట్లు కళాశాల అధ్యక్ష ,కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతోపాటు రెండు ప్రత్యేక అవార్డులు పొందినట్లు తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక గుర్తింపులో భాగంగా, కళాశాల విద్యార్థులు 85 గోల్డ్, 1,012 ఎలైట్, 439 సిల్వర్ గ్రేడ్‌లను సాధించడంతో పాటు 62 మంది టాపర్ సర్టిఫికెట్లు పొందారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, ఆర్ అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర, ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ఎన్‌పీటీఈఎల్ లోకల్ చాప్టర్ సమన్వయకర్త , కళాశాల సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సేద్యం విభాగంలో వేటపాలెం ఎద్దులు ప్రథమ స్థానం

మాచవరం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మాచవరం మండలం, మోర్జంపాడు గ్రామంలోని లక్ష్మీనరసింహా స్వామి 69వ కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ స్థాయిలో ఎడ్ల బల ప్రదర్శన పోటీలు జరుగుతున్నాయి. పోటీలను మాజీ ఎంఎల్‌సీ, టీటీడీ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి సోమవారం ప్రారంభించారు. సేద్యం విభాగంలో నిర్వహించిన పోటీల్లో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీష చౌదరి, శివ కృష్ణ చౌదరి ఎడ్లు 4935.6 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. బాపట్ల జిల్లా సంతమాగులూరు గ్రామానికి వజ్రాల తేజశ్రీరెడ్డి ఎడ్లు 4,800 అడుగుల దూరాన్ని లాగి రెండో స్థానంలో, గుంటూరు జిల్లా పెదకాకాని మండలం కొప్పురావూరి గ్రామానికి చెందిన తోట శ్రీనివాసరావు ఎడ్లు 4754.9 అడుగుల దూరాన్ని లాగి మూడో స్థానంలో, గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామానికి చెందిన గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్లు 4,400 అడుగుల దూరాన్ని లాగి 4వ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. పల్నాడు జిల్లా క్రోసూరు మండలం ఉయ్యందనం గ్రామానికి చెందిన సంపటం వీర బ్రహ్మనాయుడు ఎడ్లు 4302.3 అడుగుల దూరాన్ని లాగి ఐదో స్థానం, కృష్ణా జిల్లా గన్నవరం మండలం చంపల్లి గ్రామానికి చెందిన పొలుసు శ్రీనివాసరావు యాదవ్ ఎడ్లు 4,200 అడుగుల దూరాన్ని లాగి ఆరో స్థానంలో నిలిచాయి. తెలంగాణా రాష్ట్రం కోదాడ మండలం, కోదాడ గ్రామానికి చెందిన జక్కుల సహస్ర యాదవ్ ఎడ్లు 4068.1 అడుగుల దూరాన్ని ఏడో స్థానంలో నిలిచాయి. ఈ పోటీల్లో మొత్తం తొమ్మిది జతలు ఎడ్లు పాల్గొన్నాయి.

అంతర్ జిల్లాల పోలీస్ చెక్‌పోస్ట్ ఏర్పాటు

పెదనంపాడు, ఫిబ్రవరి, 10 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గుంటూరు-పర్చూరు రహదారిలో స్థానిక వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్టు వద్ద ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం అంతర్ జిల్లాల పోలీసు చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్ట్‌ను ప్రత్తిపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసరావు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఆయా నాయకులు నగదు, వస్తువులను తరలిస్తుంటారని వీటిపట్ల అప్రమత్తంగా ఉండి వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆయన వెంట ఎస్ఐ మధు పవన్ ఉన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10న రొంపిచర్ల మండలం బాపన్నపాలెంలో జరిగిన సుమారు రూ.11 లక్షల విలువైన నగదు, బంగారు ఆభరణాలు చోరీ కేసులో నిందితుడైన అదే గ్రామానికి చెందిన వల్లెపు విష్ణువర్థన్‌ను సోమవారం రొంపిచర్ల చెక్‌పోస్టు వద్ద అరెస్టు చేసినట్లు నరసరావుపేట డీఎస్పీ కె. నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిర్యాది చల్ల అంజమ్మ చెల్లెలి కొడుకే నిందితుడు అని తెలిపారు. నిందితుడు వెటర్నరీ డాక్టర్ పని చేస్తుంటడానీ, మద్యం, పేకాట వ్యసనాలకులోనై చోరీలకు పాల్పడుతున్నాడని వివరించారు. కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

కాకుమాను, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దర మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. ఎస్ఐ పృథ్వీ ఏక్‌నాథ్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రమైన కాకుమానుకు చెందిన పినపాల చలం (59) బాపట్ల పెదనందిపాడు ప్రధాన రహదారిలో పెదనందిపాడు వైపు వెళ్తూ ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. కుటుంబ సభ్యులు గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అలాగే కొండపాటూరుకు చెందిన బొల్లిమేర లెనిన్(24) ప్రయాణికులను దింపి తిరిగి కాకుమానుకు వెళుతున్న సమయంలో దట్టమైన పొగమంచు కారణంగా రోడ్డు పక్కనే ఉన్న నీటి కాలువలో పడిమృతి చెందాడు. కేసులు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	123,132,142
చికెన్ విత్ స్కిన్	230.00
చికెన్ స్కిన్ లెస్	240.00


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

ఆలపాటి గెలుపు కూటమిలో ప్రతి ఒక్కరి బాధ్యత

ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే తన కార్యాలయంలో సోమవారం క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, అబ్జర్వర్లు, బీఎల్వోలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నిబద్ధత, చిత్తశుద్ధి గల ఆలపాటికి ప్రథమ ప్రాధాన్యత ఓటువేసి గెలిపించుకోవాలని పట్టభద్రులను కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికలు కూటమి ప్రభుత్వ పని తీరుకు గీటురాయన్నారు. గుంటూరు జిల్లా అభివృద్ధిపై పూర్తి అవగాహన ఉన్న ఆలపాటి రాజా గెలుపు ఈ ప్రాంత అభివృద్ధికి మలుపుగా మారుతుందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి శ్రేణులు ఎంత కసితో పనిచేశారో, ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ అదే స్థాయిలో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జర్వర్ రాఘవేంద్రరావు, క్లస్టర్లు, వార్డు ప్రెసిడెంట్లు, టీడీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పినాకిని ఎక్స్‌ప్రెస్‌ను న్యూగుంటూరు మీదుగా మళ్ళించాలి


మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పార్థసారథి, దామచర్ల శ్రీనివాసరావు తదితరులు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పినాకిని ఎక్స్‌ప్రెస్‌ను న్యూ గుంటూరు రైల్వేస్టేషన్ మీదుగా మళ్ళించాలని నగరానికి చెందిన ప్రముఖులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర గ్రామీణ టెలికమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. దీనివల్ల కొన్ని వేలమంది గుంటూరు ప్రజలకు ఉపయోగంగా ఉంటుందన్నారు. అదేవిధంగా తెనాలి, బాపట్ల, చీరాల ప్రాంతంలోని కళాశాలలకు, కార్యాలయాలకు వెళ్లేవారికి మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జంగాలపల్లి పార్థసారధి, దామచర్ల శ్రీనివాసరావు, కొమ్మినేని కోటేశ్వరరావు, ముత్తినేని రాజేష్, శాఖమూరి రామ్మూర్తి, చేపూరి రాజశేఖర్, జంగాలపల్లి పవన్, బండారు ప్రసాద్ పాల్గొన్నారు.

అర్చకుడు రంగరాజన్‌పై దాడి ఉగ్రవాద చర్యే

● ఆంధ్రప్రదేశ్ అర్చక జేఏసీ

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): చిలుకూరు శ్రీబాలాజీ దేవస్థానం అర్చకస్వామి రంగరాజన్‌పై ఇటీవల దాడిచేసిన రామరాజ్యం నాయకుడు వీర రాఘవరెడ్డి చర్యలు ఉగ్రవాదాన్ని తలపిస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ ఐక్యవేదిక (అర్చక జేఏసీ) నాయకులు మండిపడ్డారు. సోమవారం గుంటూరులో జరిగిన అర్చక జేఏసీ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కంఠం నందీశ్వర్ మాట్లాడుతూ రామరాజ్యం పేరుతో ఒక దళాన్ని ఏర్పరచుకొని శ్రీరాముడి పేరుని అప్రతిష్ఠపాలు చేస్తున్నారన్నారు. ధార్మికవాదులు, అర్చకులు, పురోహితులుపై దాడి హేయమైన చర్యని అన్నారు. రంగరాజన్‌ని హింసించి వీడియోలు చేసి సోషల్ మీడియాలో హల్‌చల్ చేయటం ముమ్మాటికీ ఉగ్రవాదాన్నే తలపిస్తోందన్నారు. వీరరాఘవరెడ్డి అనుచరగణాన్ని కూడా అరెస్టు చేసి కఠినశిక్షలు విధించాలని కోరారు. సమావేశంలో జేఏసీ నాయకులు యనమండ్ర సత్య సీతారామశర్మ, ఎంఏ శేషాచార్యులు, జంధ్యాల వెంకట రామలింగేశ్వరశాస్త్రి, కొత్తలంక మురళీకృష్ణ, ఖండవల్లి కిరణ్ కుమార్, ఏ అక్షయలింగశర్మ, జి.లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వికాస్‌నగర్ ఒకటో లైను నుంచి 11వ లైను వరకు, నవభారత్‌నగర్ రెండో లైను నుంచి 4వ లైను వరకు, సిద్ధార్థనగర్ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

చుట్టుగుంట చెరువు పార్కు అభివద్ధికి చర్యలు


చుట్టుగుంట చెరువులో నీటిని తోడేందుకు ఏర్పాటుచేసిన మోటార్లు

గుంటూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): చుట్టుగుంట చెరువు, పార్కు అభివృద్ధి పనులకు నగరపాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా చెరువులో నిల్వనీటిని తోడేందుకు మోటార్లు ఏర్పాటుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చుట్టుగుంట చెరువు అభివృద్ధికి చర్యలు తీసుకుంటోంది. చెరువు చుట్టూ రెయిలింగ్ నిర్మాణం పూర్తిచేసి, పచ్చదనం పెంపొందించేలా చర్యలు చేపడుతున్నారు. ముందస్తుగా చెరువులో నీటిని ఎత్తిపోసేందుకు ప్రత్యేక మోటార్లను ఏర్పాటుచేశారు. నీటిని తోడిన తరువాత రెయిలింగ్ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు జీఎంసీ వర్గాలు తెలిపాయి. అలానే పార్కులో వాకర్స్‌కు అనువుగా ట్రాక్ పునర్‌నిర్మాణం చేపట్టాలని వారు కోరుతున్నారు. మరుగుదొడ్ల సౌకర్యం లేక వాకర్స్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా సౌకర్యాలు కల్పించాలని వాకర్స్ కోరుతున్నారు.

అమెరికాలో ఉన్న విద్యార్థులకు 6 నెలలు వెసులుబాటు కల్పించాలి

జాతీయ బీసీ బహుజన ఫ్రంట్, నాయీబ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహారావు

గుంటూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రావీణ్యం గల విద్యార్థులు ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి అనేక విధాలుగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తరుణంలో అమెరికా నూతన ప్రభుత్వం అధినేత డ్రోనాల్డ్ ట్రంపు తీసుకునే చర్యలకు చాలామంది భారతీయ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని జాతీయ బీసీ బహుజన ఫ్రంట్, నాయీబ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు అన్నారు. సోమవారం ఆయన కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలసి వినతిపత్రం అందించారు. సదరు విద్యార్థులందరికీ 6 నెలలు వెసులుబాటు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వారు ఇండియాకి తిరిగి క్షేమంగా వచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీని కోరారు. నాయీబ్రాహ్మణ బీసీ బహుజన మధ్యతరగతి వర్గాల పిల్లలు మార్ట్‌గేజ్‌లో ఆస్తులు తనఖా పెట్టి అప్పులు చేసి ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లినవారు ట్రంప్ చర్యలతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కేంద్ర సహాయమంత్రి స్పందిస్తూ తమ వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. వినతిపత్రం అందించినవారిలో గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీశైలజ గౌడ్ వున్నారు.


ఎంపీ పెమ్మసానికి వినతిపత్రం అందిస్తోన్న టి.నరసింహారావు

డ్రెయిన్‌ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

● కమిషనర్ పులి శ్రీనివాసులు


సైడ్ కాలువలను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గుంటూరులో వార్డ్ సచివాలయాల వారీగా పారిశుధ్య పనుల్లో మెరుగుదల ఉండాలని, డ్రెయిన్‌ల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం కమిషనర్ తమ రోజువారీ పర్యటనలో భాగంగా రెడ్డిపాలెం, గోరంట్ల, శ్యామలానగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి, పారిశుధ్య పనులను, చుట్టగుంట సెంటర్‌లో అన్న క్యాంటీన్‌ని పరిశీలించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయి పర్యటనల్లో పారిశుధ్య పనులపై ప్రజల నుంచి ఫిర్యాదులు అందితే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పర్యటనలో డీఈఈ రమేష్ బాబు, మధుసూదన్, ఆర్‌ఓ రవి కిరణ్ రెడ్డి, ఎస్ఎస్‌లు ఆయుబ్‌ఖాన్, సోమశేఖర్, టీపీఎస్‌లు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

బీపీఎస్ పాత దరఖాస్తుదారులకు మరోసారి అవకాశం

● వచ్చే నెల 31 వరకు గడువు పొడిగింపు

అనుమతించిన ప్లాన్‌కి భిన్నంగా లేదా అనధికారికంగా 2018 ఆగస్టు 31వ తేదీలోపు నిర్మాణం చేసి, క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసి, పరిష్కారానికి నోచుకోని అర్జీదారులు తమ అర్జీల పరిష్కారానికి ఈ ఏడాది మార్చి 31 వరకు రాష్ట్ర ప్రభుత్వం గడువు పెంచిందని, సదరు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీపీఎస్ అర్జీల పరిష్కారానికి గడువును డిసెంబర్ 31, 2024గా తొలుత ఉత్తర్వులు జారీ చేశారని, ప్రస్తుతం ఈ గడువుని మార్చి 31 వరకు పెంచారని తెలిపారు. కనుక అర్జీదారులు చెల్లించాల్సిన అపరాధ రుసుం, దస్తావేజులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవాలన్నారు. లేనిచో సదరు నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మిర్చి ధర తగ్గితే మీరేవిధంగా సాయం చేస్తారు?

● కారం మిల్లుల యజమానుల సమావేశంలో మార్కెటింగ్ డైరెక్టర్ విజయసునీత

గుంటూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం మార్కెట్‌యార్డులో మిర్చికి లభిస్తున్న ధర కంటే తగ్గితే ఏవిధంగా రైతులను ఆదుకొంటారని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ అండ్ కమిషనర్ విజయసునీత ప్రశ్నించారు. సోమవారం చుట్టుగుంటలోని మార్కెటింగ్ కమిషనరేట్‌లో ఆమె కారం మిల్లుల యజమానులతో నిర్వహించిన సమావేశంలో డైరెక్టర్ సునీత మాట్లాడారు. మిర్చి ధరల విషయంలో రైతులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ప్రస్తుతం లభిస్తున్న ధర ఎంతమాత్రం గిట్టుబాటు కాదన్నారు. ఈ నేపథ్యంలో ధర పెరగడానికి ఏమైనా చర్యలు చేపట్టగలరా అని ప్రశ్నించారు. అందుకు వ్యాపారస్థులు స్పందిస్తూ ప్రస్తుతం ఎక్స్‌పోర్ట్ ఆర్డర్స్ అంతంతమాత్రంగానే వస్తున్నాయన్నారు. అయితే కోల్డ్‌స్టోరేజ్‌లలో 80 శాతం ఖాళీ ఉండటం మంచి పరిణామమని, అయితే రైతులు నిల్వ చేసుకొన్న మిరపకాయలపై ప్రభుత్వం రుణాలు ఇప్పించగలగాలన్నారు. అయితే ఇటీవల కాలంలో జరిగిన పరిణామాల దృష్ట్యా బ్యాంకులు కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వచేసిన వాటికి రుణాలు ఇచ్చేందుకు వెనకడుగు వేస్తున్నాయన్నారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్లు కాకుమాను శ్రీనివాసరావు, రాజశేఖర్, ఏడీ బీ రాజబాబు పాల్గొన్నారు.

నిత్యజీవిత కథే భారతం...

● పద్మశ్రీ డాక్టర్ గరికిపాటి నరసింహారావు


ప్రవచనం చేస్తున్న డాక్టర్ గరికిపాటి నరసింహారావు, హాజరైన భక్తులు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): వేదవ్యాస మహర్షి రచించిన మహాభారత కథ మన నిత్యజీవితంలో జరిగే సంఘటనలేనని మహా సహస్రావధాని పద్మశ్రీ డాక్టర్ గరికిపాటి నరసింహారావు అన్నారు. స్థానిక పట్టాభిపురం శ్రీరమాసత్యనారాయణస్వామి దేవాలయ ప్రాంగణంలో 48వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా మహాభారతయుద్ధంలో భగవానుని పాత్ర అనే అంశంపై జరుగుతున్న ఆధ్యాత్మిక ప్రవచనాలు సోమవారంతో ముగిశాయి. డాక్టర్ నరసింహారావు ప్రవచనం చేస్తూ ప్రతివారు ఆదర్శజీవితం కోసం రామాయణాన్ని ఆధ్యాత్మిక జీవనానికి భాగవతాన్ని పఠించాలన్నారు. భారత, భాగవత, రామాయణాలను పఠించినా అందులోని సారాంశాన్ని కొద్దిమంది మాత్రమే అవలంబిస్తారన్నారు. కార్యక్రమాన్ని ఆలయకమిటీ సభ్యులు పర్యవేక్షించారు. కాగా ఆలయ 48వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు, అలంకరణ జరిగాయి. స్వామి వారిని పెళ్ళికుమారునిగా అలంకరించారు.

ఘనంగా బ్రహ్మోత్సవాల పూర్ణాహుతి


స్వామి వారికి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

గుంటూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేట నాలుగో లైనులోని శ్రీ హంపీపీఠ పాలిత శ్రీగంగామీనాక్షి సోమసుందరేశ్వరాలయం 124వ వార్షిక బ్రహ్మోత్సవాల ఆఖరిరోజు సోమవారం స్వామికి పూర్ణాహుతిహోమం, కల్యాణ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో యాగబ్రహ్మ గుంటూరు కాశీ విశ్వనాథ్ శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఏకాప్రసాద్ దంపతుల పూర్ణాహుతి నిర్వహించారు. ఐదురోజులుగా ప్రధాన దేవాలయంతోపాటు ఉపాలయాల సంప్రోక్షణ అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఆలయ గోపుర శిఖరాలకు పవిత్ర జలాలతో, పూర్ణాలతో అభిషేకాలు చేశారు. మంగళవారం స్వామి వార్లకు వాహనసేవ, భక్తులకు అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు కుందుర్తి సుబ్రహ్మణ్యశర్మ, కుందుర్తి భాస్కర్‌శర్మ, కుందుర్తి శ్రీనివాస్ శర్మ, యు.మధు శర్మ తెలియజేశారు.

భాగవత రస వైభవంపై ఆధ్యాత్మిక ప్రవచనం


ప్రసంగిస్తున్న నరసింహానంద భారతీస్వామి, పాల్గొన్న చిట్టిపోతు మస్తానయ్య తదితరులు

గుంటూరు(తూర్పు) ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై సోమవారం సాహితీవేత్త పీఎస్‌ఆర్ ఆంజనేయప్రసాద్ జయంతి సందర్భంగా భాగవత రస వైభవంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. తొలుత మంత్రాశ్రమం పీఠాధిపతి నరసింహానంద భారతీస్వామి, ఆలయ కమిటి అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, సంస్కృత పండితులు డాక్టర్ డీఎస్ దీక్షిత్‌లు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమాన్ని పి.రవికిషోర్, పి.హైమానంద పర్యవేక్షించారు.

ముగిసిన శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు


పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేద పండితులు, పాల్గొన్న ఆలయకమిటీ సభ్యులు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేట, ఓంకార క్షేత్రంలో జరుగుతున్న శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. శ్రీసీతా రామ పట్టాభిషేకం, శాంతిహోమం పూర్ణాహుతి, అన్నసమారాధన, శ్రీసీతారామ పరివార దేవతలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం శాంతి హోమం మహాపూర్ణాహుతి జరిగింది. అన్నసమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఓం కార క్షేత్ర కార్యదర్శి నంబూరు వేంకట శ్రీమన్నారాయణమూర్తి పర్యవేక్షించారు.

క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం

● సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ భాస్కర్ కల్లూరి

● మంగళగిరి స్టేడియంలో ఐఏ అండ్ ఏడీ ఉద్యోగుల క్రికెట్ టోర్నీ ప్రారంభం

● తొలిరోజు కేరళ, తమిళనాడు జట్ల గెలుపు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నిత్యం విధుల్లో నిమగ్నమై ఉంటున్న ఉద్యోగులకు క్రీడలతో ఆటవిడుపు లభించడంతోపాటు మానసిక, శారీరక దృఢత్వం పెంపొందుతుందని విజయవాడ ఆడిట్ జనరల్ కార్యాలయం సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ భాస్కర్ కల్లూరి అన్నారు. మంగళగిరిలోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో ఐఏ అండ్ ఏడీ సౌత్ జోన్ క్రికెట్ టోర్నమెంటు-2025 సోమవారం ప్రారంభమైంది. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల జట్ల తరఫున సుమారు 80 మంది క్రీడాకారులు విచ్చేశారు. ఆడిట్ జనరల్ కార్యాలయం సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్స్ భాస్కర్ కల్లూరి, కిశోర్ రెడ్డి, ఆర్.శ్యామ్, రాకేష్ నాయక్, ఎన్.నిఖిల జెండా ఊపి పోటీలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ విజయవాడలోని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయం నేతృత్వంలో తొలిసారిగా సౌత్ జోన్ క్రికెట్ టోర్నీ నిర్వహించడం సంతోషకరమన్నారు. ఇందుకు మంగళగిరి అంతర్జాతీయ స్టేడియం అద్భుతమైన వేదికగా నిలిచిందన్నారు. మంగళగిరి స్టేడియానికి అప్రోచ్ రోడ్ల నిర్మాణం చేపడితే మరింత సౌకర్యవంతంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర విభజన అనంతరం తొలిసారి ఏపీలో ఈ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ టోర్నీలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు రంజీ, ఐపీఎల్ వంటి టోర్నీల్లో పాల్గొనే అవకాశం దక్కుతుందన్నారు.

తొలిరోజు ఆంధ్రప్రదేశ్-తెలంగాణ, కేరళ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కేరళ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. ఏపీ-తెలంగాణ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 96 పరుగులు చేసింది. రవితేజ 40, యశ్ కొఠారి 26 పరుగులు చేయగా, కేరళ బౌలర్ అంకిత్ మిశ్రా 4 ఓవర్లలో 17 పరుగులిచ్చి 4 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కేరళ జట్టు 18.3 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 100 పరుగులు చేసి విజయం సాధించింది. మహమ్మద్ షన్ను 43 పరుగులు, శాలీ శాంసన్ 25 పరుగులు చేశారు. రెండో మ్యాచ్‌లో తమిళనాడు, కర్ణాటక జట్లు తలపడ్డాయి. తమిళనాడు జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. కర్ణాటక జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. హెచ్.అర్జున్ 47, శరత్ 40 పరుగులు, జే.సుచిత్ 31 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తమిళనాడు జట్టు ఆఖరి బంతి వరకు పోరాడి 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. వేదాంత్ భరద్వాజ్ 57 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లతో 83 పరుగులు, విఘ్నేష్ 27 పరుగులు చేయగా, కర్ణాటక బౌలర్లు దర్శన, జై చెరో రెండు వికెట్లు పడగొట్టారు. కాగా, మంగళవారం ఆంధ్ర-తెలంగాణ, తమిళనాడు జట్ల మధ్య మొదటి మ్యాచ్, కేరళ, కర్ణాటక జట్ల మధ్య రెండో మ్యాచ్ జరగనుంది. తొలుత ఆంధ్రప్రదేశ్ తరఫున జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ప్రాతినిధ్యం వహించి అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన నీలం మణిశ్రావణిని నిర్వాహకులు అభినందించారు. గతంలో కామన్‌వెల్త్ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ సర్టిఫికెట్ పొందడమే కాకుండా ఆక్లాండ్‌లో జరిగిన 84 కిలోలు పైబడిన విభాగంలో ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ క్లాస్ సబ్ జూనియర్ కోటాలో అత్యుత్తమ ప్రతిభకనబర్చింది.



జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ భాస్కర్ కల్లూరి, టోర్నీలో తలపడుతున్న క్రీడాకారులు

ఆలపాటి గెలుపును సీఎంకు కానుకగా ఇస్తాం


ఎమ్మెల్యే గళ్లా మాధవి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు కానుకగా ఇస్తామని ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకురాలు పొడపాటి తేజస్వి, సింహాద్రి కనకాచారితో కలిసి ఆమె క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలు, పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి అత్యధిక మెజారిటీ ఇచ్చి ఆలపాటిని గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. బూత్ స్థాయిలో ఉన్న పట్టభద్రులను కలిసి కూటమి ప్రభుత్వానికి అండగా నిలిచేలా చూడాలని కోరారు. అనంతరం ఆమె ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. 39వ డివిజన్ గుజ్జనగుండ్లకు చెందిన నారాయణమ్మకు వైద్యం నిమిత్తం ఎమ్మెల్యే మాధవి సిఫార్సుతో మంజూరైన రూ.2.9లక్షల సీఎం సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. శ్రీనివాసరావుపేటలోని శ్రీవెంకటేశ్వరస్వామి గుడి ప్రాంగణంలో అయ్యప్పస్వామి గుడి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం గుడిలో గళ్లా మాధవి, రామచంద్రరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్నేహహస్తాలు ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం

● నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు


విద్యార్థినులకు ల్యాప్‌టాప్, ఆర్థికసాయం అందజేస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పదేళ్ల క్రితం ఇంజనీరింగ్ విద్యను అభ్యసించిన విద్యార్థులు పదిమంది కలసి స్నేహహస్తాలు సంస్థ స్థాపించి రెండు తెలుగు రాష్ట్రాలలో చదువుతున్న పేద మధ్యతరగతి విద్యార్థులకు ఇతోధికంగా చేయూతనందించడం ప్రశంసనీయమని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. స్నేహహస్తాలు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో లాం ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న వెనిగళ్ళ జ్యోతికి ల్యాప్‌టాప్, విజ్ఞాన్ నిరుల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినికి హాస్టల్ వసతికోసం రూ.25వేల ఆర్థికసాయాన్ని ఎంపీ గృహంలో ఆయన చేతుల మీదగా అందజేశారు. అనంతరం ఫౌండేషన్ డైరెక్టర్ దండమూడి విజయ్ మాట్లాడుతూ దేశ, విదేశాల్లో స్థిరపడిన స్నేహితుల బృందం ప్రతి నెలా కొంత పొదుపు చేసి విద్య, వైద్య సేవలకు చేయూతనందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కోఆర్డినేటర్ టీ కరిముల్లాబాబు పాల్గొన్నారు.


డాక్టర్ విజయ్‌కుమార్‌తో డాక్టర్ రామ్‌కుమార్, ప్రిన్సిపాల్ సుందరాచారి తదితరులు

డాక్టర్ విజయ్‌కుమార్‌కు సత్కారం

గుంటూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మధుమేహ వ్యాధి చికిత్స నిపుణుడు డాక్టర్ జి.విజయ్‌కుమార్‌కు స్థానిక రాజేంద్రనగర్ క్యాపిటల్ హోటల్ సమావేశ మందిరంలో స్వర్ణ పతక సన్మానం జరిగింది. ఈ సందర్భంగా వైద్యకళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుందరాచారి మాట్లాడుతూ మూడు దశాబ్దాల క్రితం మధుమేహ వ్యాధి చికిత్స నిపుణుడు డాక్టర్ వీవీ రామ్‌కుమార్, పద్మశ్రీ వీ శేషయ్య పేరున ప్రతి ఏడాది ఆయా విభాగాలకు చెందిన వైద్యులను స్వర్ణపతకంతో సత్కరిస్తున్నారని గుర్తుచేశారు. అనంతరం షుగర్‌పై పలువురు వైద్యులు జూనియర్ డాక్టర్లకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేశారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వీ, ప్రముఖ వైద్యులు కమలా రామ్‌కుమార్, భవతరణీ, పూజ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విశ్రాంత డ్రైవర్ల సంఘం ఏర్పాటు


సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు సంసాని శ్రీనివాసరావు, వేదికపై జిల్లా అధ్యక్షుడు పాపారావు తదితరులు

గుంటూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఆవరణలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం కార్యాలయంలో సోమవారం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సంసాని శ్రీనివాసరావు అధ్యక్షతన ప్రభుత్వ విశ్రాంత డ్రైవర్ల సంఘం ఏర్పాటుకు తీర్మానం చేసి ఆమోదించారు. విశ్రాంత డ్రైవర్ల సంఘం అధ్యక్షుడిగా యండమూరి నాగరాజు(పశ్చిమ గోదావరి)ని ఎన్నుకున్నారు. మిగిలిన కార్యవర్గం ఎన్నిక కోసం జిల్లాల పర్యటన చేయాలని తీర్మానించారు. ఈ సందర్భంగా సంసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్ని జిల్లాల సంఘ భవనాల్లో ఒక గదిని విశ్రాంత డ్రైవర్ల కోసం కేటాయించేలా చూస్తామన్నారు. సంఘానికి అధ్యక్షుడిగా ఎన్నికైన యండమూరి నాగరాజు మాట్లాడుతూ తాము ప్రభుత్వ డ్రైవర్ల సంఘానికి అనుబంధంగా పని చేస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు వేంపాటి పాపా రావు మాట్లాడుతూ గుంటూరు జిల్లా విశ్రాంత డ్రైవర్ల సంఘానికి అధ్యక్షుడిగా మొగిలి గురవయ్య, కార్యదర్శిగా కొల్లి కోటిరెడ్డి, గౌరవాధ్యక్షుడిగా కఠారి హన్మంతరావు, ముఖ్య సలహాదారుడిగా ఎం కోటేశ్వరరావు నాయక్‌ని ఎన్నుకున్నామన్నారు. కార్యక్రమంలో జే మునిబాబు, జీహెచ్ నాగులు, కే సాల్మన్‌రాజు, ఎంఆర్ మనోహర్, కే నాగిరెడ్డి, రాయుడు సత్యన్నారాయణ, ఏ భాస్కర్, ఏ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆప్ ఓటమి ప్రత్యామ్నాయ రాజకీయాలకు నష్టమే

గుంటూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఆప్ ఓటమి ప్రత్యామ్నాయ రాజకీయాలకు జరిగిన నష్టంగానే భావించాలని విశ్లేషకుడు ఇ.చంద్రయ్య అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఢిల్లీ ఎన్నికల ఫలితాలపై విశ్లేషణ సభలో ఆయన ప్రసంగించారు. ఢిల్లీ ఫలితాల నుంచి కూడా గుణపాఠం నేర్వగలిగితేనే ప్రజాస్వామ్యానికి ఎంతో కొంత రక్ష ఉంటుందన్నారు. ప్రత్యామ్నాయ రాజకీయాలతో వచ్చే ఏ పార్టీనైనా ధనబలం ముందు మోకరిల్లాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. విడివిడిగా తలపడిన ఆప్ 43శాతం ఓట్లు, కాంగ్రెస్ ఆరు శాతం పైన ఓట్లు తెచ్చుకొని తమలో తామే ఓట్లు చీల్చుకుని బీజేపీ నెత్తిన పాలు పోశారన్నారు. సమావేశంలో సంస్థ కార్యదర్శి శివరామిరెడ్డి, సింగరయ్య, సదాశివం, మురళీకృష్ణ తదితరులున్నారు.

కళా మాణిక్యాలు!

● రాష్ట్రస్థాయి కళోత్సవ్ పోటీల్లో ప్రతిభ ● సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణింపు

● ప్రదర్శనలతో సత్తా చాటుతున్న వేల్పూరు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న గైడ్ టీచర్ శ్రీనివాసరావు (ఫైల్)

పోటీలు.. విజయాలు

- 2024-25లో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో నిర్వహించిన కళోత్సవ్ పోటీల్లో హేమా టీం సభ్యులు మైమ్‌లో ప్రథమ స్థానాన్ని, నాగరోహిణి టీం సభ్యులు జానపద నృత్యం, కోలాటంలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి కళోత్సవ్ పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా జానపద నృత్యం, కోలాటం పోటీల్లో ద్వితీయ స్థానాన్ని సాధించారు.
- 2024లో నిర్వహించిన పల్నాడు బాలోత్సవం పోటీల్లో పాఠశాల విద్యార్థులు వివేక్, జశ్వంత్, సాయికృష్ణ క్విజ్‌లో ప్రథమ స్థానం సాధించగా, విద్యార్థిని నాగరోహిణి వ్యాసరచనలో మూడో స్థానాన్ని, మ్యాప్ పాయింటింగ్‌లో రెండో స్థానాన్ని సాధించింది. స్కిట్‌లో విద్యార్థి నందు టైమ్ మిషన్ నాటికని ప్రదర్శించి మూడోస్థానంలో నిలిచాడు.
- సైన్స్ ఫెయిర్‌లో బుక్ పెస్టివల్ పోటీల్లో పాఠశాల విద్యార్థి సంజయ్ నియోజక వర్గ స్థాయిలో ప్రథమ స్థానాన్ని, జిల్లా స్థాయిలో మూడో స్థానాన్ని సాధించాడు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన సాంఘిక శాస్త్ర దినోత్సవ పోటీల్లో వ్యాసరచనలో నాగరోహిణి ప్రథమస్థానాన్ని సాధించగా, వక్తృత్వం వివేక్, క్విజ్‌లో వివేక్, జశ్వంత్, సాయికృష్ణ టీం ద్వితీయ స్థానాలు సాధించారు.
- 2024 జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో జరిగిన పోటీల్లో వ్యాసరచనలో శ్రీవల్లి ప్రథమ స్థానం, వక్తృత్వంలో వివేక్ ప్రథమ స్థానం, స్కిట్‌లో వివేక్ టీం ప్రథమ స్థానం, పాటల్లో శ్రీహేమలత రెండో స్థానం సాధించి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాస్థాయిలో అందరూ ఓటెయ్యాలి అన్న స్కిట్‌ను నిర్వహించి వివేక్ టీం ప్రథమ స్థానంలో నిలువగా, పాటల పోటీల్లో శ్రీహేమలత రెండోస్థానాన్ని సాధించి కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు పొందారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న విద్యార్థులు, వారిని ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయుల అభిప్రాయాలు వారి మాటల్లోనే...

శావల్యాపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని విశ్వసించారు. తమకంటూ ప్రత్యేక గుర్తింపును సాధించాలన్న తలంపుతో అందరికీ భిన్నంగా ఉండేలా కళాకారులుగా ఎదిగేందుకు అహర్నిశలు కృషి చేశారు. పేదరికం అనేది ప్రతిభకు ఏ మాత్రం అడ్డుకాదని నిరూపించారు వేల్పూరుకు చెందిన పేదింటి బిడ్డలు. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పేరొందిన వివిధ కళా వేదికలపై అందరినీ ఆకట్టుకునేలా లఘు నాటికలు, డ్యాన్సులు, జానపద నృత్యం, కోలాటం, వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, మ్యాప్ పాయింటింగ్ వంటి కళాత్మకమైన పోటీలలో ఉత్తమ ప్రదర్శనలిచ్చి మట్టిలో మాణిక్యాలుగా నిలిచారు వేల్పూరు జడ్పీ పాఠశాల విద్యార్థులు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో జిల్లాలోనే ప్రథమ, ద్వితీయ బహుమతులను సాధించి చదువుకొన్న పాఠశాలకు, పుట్టిపెరిగిన గ్రామానికి పేరు ప్రఖ్యాతులు సాధించారు. జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో, బుక్ ఫెస్టివల్‌లో తృతీయ స్థానంలో నిలిచి తమ ప్రతిభను నిరూపించుకున్నారు. విద్యతోపాటు క్రీడలు, కళాత్మక రంగాల్లో రాణిస్తూ తోటి విద్యార్థులందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. హెచ్ఎం మహబూబ్ సుభాని, గైడ్ టీచర్ జ్యోతి శ్రీనివాసరావు, తెలుగు ఉపాధ్యాయుడు మరియదాసు, పీడీ కాకుమాను రాజేష్ ప్రోత్సాహం తో వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొంటూ ముందుకు సాగుతున్నారు.

భవిష్యత్‌లో ఇంకా రాణించాలి



జాతీయ ఓటర్ల దినోత్సవం రోజున పాటల పోటీల్లో పాల్గొని మంచి గుర్తింపు పొందడం ఆనందంగా ఉంది. పోటీలకు వెళ్లడం వలన బయట ప్రపంచంపై అవగాహన పెరుగుతుంది. భవిష్యత్తులో ఇంకా రాణించాలన్న పట్టుదల పెరుగుతుంది. పోటీలతో బిడియం తగ్గి అందరితో మాట్లాడే ధైర్యం వస్తుంది. చదవాలన్న ఆసక్తి పెరుగుతుంది. తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ప్రోత్సాహం బాగుంది.

- యారం శ్రీహేమలత, పాఠశాల విద్యార్థిని

కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు



సైన్స్ ఫెయిర్‌లో పాల్గొని బుక్ పెస్టివల్‌లో తృతీయ స్థానాన్ని సాధించి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతిని అందుకోవడం ఆనందంగా ఉంది. పోటీల్లో పాల్గొనడం వలన ఎన్నో కొత్త విషయాలు నేర్చుకొన్నాను. నా నైపుణ్యంపై నమ్మకం ఏర్పడింది. రానున్న రోజుల్లో మరింతగా కష్టపడి మరిన్ని బహుమతులను గెలుచుకొనేందుకు కృషి చేస్తాను.

- జగం సంజయ్, పాఠశాల విద్యార్థి

అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్నాం



విద్యార్థులు చదవుతోపాటు అన్ని రంగాల్లో రాణించినప్పుడే ఉన్నత స్థాయికి ఎదుగుతారు. వారిని కళాకారులుగా, క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులందరం ఎంతో ప్రోత్సహిస్తున్నాం. సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని, పట్టుదలను నింపుతాయి. చదువులో కూడా ముందుంటారు. పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించడం శుభపరిణామం.

- మహబూబ్ సుభాని, హెచ్ఎం, వేల్పూరు జడ్పీ పాఠశాల



బుక్ ఫెస్టివల్‌లో కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న విద్యార్థి (ఫైల్)

విద్యార్థుల్లో సర్వతోముఖాభివృద్ధి



విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా సాంస్కృతిక కార్యక్రమాల వైపు కూడా మొగ్గు చూపినప్పుడే వారిలో సర్వతోముఖాభివృద్ధి కలుగుతుంది. విద్యార్థులు ఆనందంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటా రు. విద్యార్థుల మధ్య స్నేహభావం పెరుగుతుంది. స్టేజీలపై ప్రదర్శనలివ్వడం వల్ల భయం పోతుంది. సాంస్కృతిక కార్యక్రమాల వలన ఒకరికి ఒకరు సహకారం, కష్టపడే తత్వాలు వృద్ధి చెందుతాయి.


-జ్యోతి శ్రీనివాసరావు, పాఠశాల గైడ్ టీచర్

ధర్మసత్రం... లేదే లెక్కాపత్రం!

(5వ పేజీ తరువాయి)

ఆస్తులన్నట్టు ఇష్టానుసారం భవనాలు కట్టేసి అమ్మేసుకుంటున్న పరిస్థితీ లేకపోలేదు. కొన్ని సత్రాల్లో మాత్రమే దాతల లక్ష్యానికి విలువనిచ్చి అన్నదానం చేస్తూ వారి ఆశయాన్ని కాపాడుతుంటే, 80 శాతం సత్రాలు ట్రస్టీల ఇష్టారాజ్యమైపోయాయి. దీంతో దాతల సొమ్ము, ఆస్తులు స్వార్థపరుల పాలవుతున్నాయి. అందరికోసం ఉపయోగించాల్సిన ఆస్తుల్ని కొందరికోసం... అదికూడా సొంతానికి వాడేసుకుంటుంటే, దేవాదాయశాఖ మాత్రం కళ్లప్పగించి చూస్తోంది.

తెనాలి, గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి, పొన్నూరు వంటి పట్టణాలే కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. బాపట్ల, గుంటూరు జిల్లాలకంటే ఎక్కువ సత్రాలు, ఎక్కువ భూములు ఉన్నది పల్నాడు జిల్లాలోనే. నరసరావుపేట, సత్తెనపల్లి, చిలకలూరిపేట, మాచర్ల, పిడుగురాళ్ల వంటి చాలా పట్టణాల్లో అన్నదాన సత్రాల ఆస్తులు పరాధీనమయిపోతున్నాయి. బాపట్ల జిల్లాలోనూ రేపల్లె, చెరుకుపల్లి, కొల్లూరు, భట్టిప్రోలు, చందోలు, బాపట్ల వంటి చోటకూడా ఆస్థులకు రక్షణ లేని పరిస్థితి. అమరావతికి చెందిన సదావర్తి సత్రం భూములకు సంబంధించి గతంలో జరిగిన వివాదమే వీటికి ఉదాహరణ. ఈ సత్రం 1885లో నిర్మితమయితే, దీనికి సంబంధించి చెన్నై దగ్గర ఉన్న 471 ఎకరాల భూమి దీనికింద ఆస్తిగా దాత వాసిరెడ్డి వంశస్తురాలు వెంకటలక్ష్మమ్మ 1907లోనే రాసిచ్చిన విషయం తెలిసిందే. అయితే దేవాదాయ శాఖ దీనిని పట్టించుకోకపోవటంతో మొత్తం భూములు అన్యాక్రాంతమై, చివరకు 83 ఎకరాలు మాత్రమే మిగిలాయి. దీనిని మన ప్రభుత్వం అమ్మటానికి కూడా సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సిన పరిస్థితి తీసుకొచ్చారు. ఇదే తరహాలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో భారీగా ఆస్థులున్న సత్రాల ఆస్తుల పరిరక్షణ గాలిలో దీపంలా వదిలేశారు. దీంతో దాతల ఆశయం పక్కదారి పడుతోంది. కొందరి చేతుల్లోకే మొత్తం ఆస్తులు చేరిపోతున్నాయి.



ఘంటా హనుమ్మ చారిటీస్ ధర్మ సత్రం భవనం

ఒక్క తెనాలినే ఉదాహరణగా తీసుకుంటే...

తెనాలి పట్టణం, చుట్టుపక్కల గ్రామాల్లో అయితే భర్తిపూడి రామయ్య పంతులు అన్నపూర్ణ ధర్మసత్రం, ఘంటా హనుమయ్య చారిటీస్, చుండూరువారి ధర్మసత్రం, యడ్లపల్లి కోటిలింగం ధర్మ సత్రం, ఓంకారాశ్రమం, కుసుమ మరనాద నిత్య అన్నదాన శాంతి ఆశ్రమం, కాకుమాను రామస్వామి శాంతి భవనం. కాకుమాను వెంకటసుబ్బన్న ధర్మసత్రం, శ్రీ రఘోత్తమరామశాస్త్రిగారి ధర్మ సత్రం, పోలేపెద్ది ఆదెమ్మ వేదపాఠశాల, కాకుమాను శంకరుని ధర్మసత్రం వంటి పదుల సంఖ్యలోనే సత్రాలున్నాయి. వీటిలో చాలావరకు తెనాలి పట్టణ నడిబొడ్డున ఉన్నవి అయితే, మరికొన్ని మంచి డిమాండ్ ఉన్న ప్రాంతాల్లోనూ ఉన్నాయి. తెనాలి బోస్ రోడ్, బుర్రిపాలెం రోడ్, రైల్వే స్టేషన్ ఎదుట అత్యంత ఖరీదయిన ప్రాంతాల్లో ఉండటంతో వీటిపై ట్రస్టీల కుటుంబీకులకు ఆశ పెరిగిపోయింది. దీంతో దాతృత్వం చూపాల్సిన స్థానంలో తమకు అనుకూలమైన వ్యాపార స్థావరాలను ఏర్పాటు చేసుకున్నారు. అయితే వీటిని నిర్మించిన ప్రదేశాలు ఇప్పుడు అత్యంత విలువైన ప్రదేశాలయితే, ఇవికాక వీటిపేరిట ఉన్న పొలాలు, ఇతర దుకాణ సముదాయాల వంటి ఆస్థులు కూడా ట్రస్టీల పెత్తనంలో పూర్తిగా మారిపోతున్నాయి. పెద్ద సత్రాలకు దేవాదాయ శాఖ ప్రత్యేక అధికారులను పర్యవేక్షణకు నియమించినా అక్కడ జరిగే కార్యక్రమాలు ఏమీ లేకపోవటంతో వారు వీటిని పట్టించుకోకపోవటం, అసలు సంవత్సరానికొకసారికూడా వాటివైపు కన్నెత్తి చూడకపోవటంతో అన్యాక్రాంతమయిపోతున్న పరిస్థితి. వస్తున్న ఆదాయానికి ఒక లెక్కాలేదు... ఆస్తులకు రక్షణా లేదన్నట్టు తయారయింది.

అన్న'దానం' కాగితాల్లోనే...

ప్రతి సత్రంలోనూ అన్నదానం చేయటం, వసతి అవకాశం ఉన్నా భవనాల్లో గదులు అద్దెలకివ్వటం వంటివిచేసి, దేవాదాయ శాఖకు ఆదాయాన్ని జమచెయ్యాలి. కానీ ఇక్కడ అన్నీ కాగితాల్లోనే ఉంటుంటే, ఆదాయం మాత్రం ట్రస్టీల చేతుల్లోకి వెళ్లిపోతోంది. ప్రతి అన్నదాన సత్రంలోనూ ఐదు నుంచి 25 మంది వరకు రోజూ అన్నదానం చేయటం, ఆయా దాతల జయంతి, వర్ధంతి సందర్భాల్లో పేదలకు ప్రత్యేక పంపిణీలు చేయటం పరిపాటి. భర్తిపూడి రామయ్య పంతులు అన్నపూర్ణ ధర్మసత్రం కింద 13.9 ఎకరాల భూమి, 7 సెంట్లలో సత్రం ఉంది. వీటిపై ఆదాయమే భారీగా వస్తుంది. సత్రం ఉన్న స్థలం బుర్రిపాలెం రోడ్డులో ఉంటే, దీనికి మంచి డిమాండే ఉంది. అయితే దీనిలో భవనం శిథిల స్థితికి చేరితే, ఆరుబయట ఉన్న ఖాళీ స్థలాన్ని బీరువాలు తయారుచేసే వారికి అద్దెకిచ్చారు. వీటి లెక్కలు దేవాదాయ శాఖకు చేరవు. ప్రతి ద్వాదశికి 29 మందికి అన్నదానం, చైత్ర బహుళ పాడ్యమి రోజున పేదలకు విశేష సంఖ్యలో అన్నదానం చెయ్యాలనేది దాతలు ఆలోచన. అయితే ఇక్కడ దశాబ్దకాలంగా అన్నదానమనే మాటే లేకుండాపోయింది. వచ్చిన ఆదాయం ఎటు పోతుందో! ఖాతాలో ఎంత జమవుతుందో ఆ దేవుడికే ఎరుక. సత్రంలో ఎంతమందికి అన్నదానం చెయ్యాలనేది గోడపై ట్రస్టీపేరుతో గతంలోనే రాసిఉంటే, దానిలో సంఖ్య, ఇతర వివరాలు చెరిపేసి ఉంచటం మరో ప్రత్యేకం.

రైల్వే స్టేషన్ ఎదుటే ఉన్న ఘంటా మనుమయ్య చారిటీస్‌కింద ధర్మ సత్రం, ఒక వసతి గృహం, పశువైద్యశాల నిర్వహిస్తున్నట్టు కాగితాల్లో ఉంది. అయితే ఇక్కడ భవనం పైన రేకులు వేసి ఒక కళ్యాణ మండపాన్ని నిర్మించారు. దీనిలో గదులు అద్దెకు కావాలని వెళితే ఖాళీ లేవని, చెప్పటం కొసమెరుపు. పేదలకు తక్కువ అద్దెకు వసతి ఇవ్వాల్సిఉన్నా, వాటిని కళ్యాణ మండపానికి సంబంధించిన డెకరేషన్, వంట పాత్రలకోసం, డైనింగ్ సామగ్రి నిల్వలకు, ఇతర అవసరాలకు గదులను వారే సొంతగా కేటాయించేసుకోవటం విశేషం. పోనీ దాతలిచ్చినదే కనుక శుభకార్యాలకయినా నామమాత్రపు రేటుకు అద్దెకిస్తున్నారా అంటే అదీ అంతంత మాత్రమే. మామూలు కళ్యాణ మండపాల్లాగానే అద్దెలు వసూలు చేయటం విశేషం. అయితే ఇక్కడ దాతల కోరిక మేరకు కొన్ని సందర్భాల్లో అన్నదానం చేయటం మాత్రం జరుగుతూ వస్తోంది.

కాకుమాను శంకరుని ధర్మసత్రం 1898లోనే నిర్మితమైంది. దీనికి 2.9 ఎకరాల భూమితోపాటు పట్టణ నడిబొడ్డయిన బోస్‌రోడ్డులో 20 దుకాణాలున్నాయి. వీటిపై వచ్చే ఆదాయంతో ప్రతి ద్వాదశికి పేద బ్రాహ్మణులకు అన్నదానం, దాత మరణించిన రోజున 2వేల మంది పేదలకు అన్నదానం, పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించాల్సి ఉంది. అయితే ఇక్కడ పేద విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఉపకార వేతనాలు మాత్రం బాగానే ఇస్తున్నారు. నిత్యాన్నదానం లేకపోయినా, దాత వర్ధంతిరోజున మాత్రం పేదలకు అన్నదానం జరుగుతూనే ఉంది. అయితే దీని కింద అత్యంత ఎక్కువ అద్దెలు వచ్చే దుకాణాలున్నాయి. ఇటీవలే సత్రంలోపల భవనాలు నిర్మించారు. అయితే వీటి లెక్కల విషయంలో మాత్రం పలు విమర్శలున్నాయి.

రఘోత్తమరాయ రామశాస్త్రి ధర్మసత్రాన్ని 1901లో నిర్మించారు. ప్రస్తుతం కార్యకలాపాలు అంతంతమాత్రమే. కాకుమాను రామస్వామి శాంతి భవనం కింద 9 దుకాణాలపై వచ్చే ఆదాయంతో నిత్యం 40మంది ప్రత్యేక అవసరాలున్న వారికి అన్నదానం చెయ్యాలనేది నిర్ణయం. కానీ నిత్యం జరుగుతున్న దాఖలాలు లేవు.

కాకుమాను వెంకటసుబ్బమ్మ ధర్మసత్రం రైల్వేస్టేషన్ సమీపంలోనే ఉంది. బాటసారులకు వసతి కల్పించటం, దీనికిందున్న షాపురూములపై వచ్చే అద్దెతో నిర్వహణ జరపాలి. కానీ అవీ నామమాత్రమే.

చుండూరు వారి ధర్మ సత్రం కూడా 1902లో స్థాపించారు. దీనికింద 20 ఎకరాల భూమి ఉంది. 6 షాపులు ఉన్నాయి. ప్రజలకు వసతి సౌకర్యం కల్పించటం, 6 గురికి అన్నదానం చేయటం చెయ్యాలి. అయితే ఇక్కడ అన్నదానం జరుగుతోంది. ఆస్థుల పరిరక్షణ ఎంతవరకు ఉందనేది ప్రశ్నార్థకమే. ఇదే తరహాలో మిగిలిన ప్రాంతాల్లోని ధర్మ సత్రాల ఆస్తులు అన్యాక్రాంతం అయిపోతున్నాయి. వీటికి సత్రం ఉన్న ప్రాంతంలో కాకుండా ఇతర జిల్లాల్లోనూ పొలాలు, ఇతర ఆస్తులున్నాయి. సత్రం ఉన్నచోటే ఆస్తులు పరాధీనమైపోతుంటే, ఇతర జిల్లాల్లో ఉన్న ఆస్థుల పరిస్థితి సరేసరి. కొన్నిచోట్ల భూముల ధరలకు రెక్కలు రావటంతో కొంత భూమిని ట్రస్టీలు సొంత స్థలాల కింద చేతులు మార్చారనేదికూడా వస్తున్న ఆరోపణ. అయితే వీటిపై దేవాదాయ శాఖ అధికారులను ప్రశ్నిస్తే మాత్రం అంతా గోప్యంగా ఉంచటం విశేషం. ఎవరైనా గట్టిగా ప్రశ్నిస్తే ట్రస్టీలను అడగాలని బదులివ్వటం కొసమెరుపు. ఆస్తులను పరిరక్షించాల్సిన అధికారులే ట్రస్టీల చేతిలో బొమ్మలుగా మారిపోవటంతో దాతల ఆస్తులు దారిమళ్లి చేతులు మారిపోతున్నాయి. వీటి లెక్కలు ఆ దేవదేవుడే చూసుకోవాల్సిన పరిస్థితి.

ప్రణాళికతో పదింతల ఫలితం

● సాధన చేస్తే మంచి మార్కులు

● 10వ తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయుల సూచనలు



సత్తెనపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి జీవితానికి తొలి సోపానమైన 10వ తరగతి పరీక్షలు సమీపిస్తున్నాయి. విద్యార్థులపై ఒత్తిడి లేకుండా రోజు విడిచి రోజు పరీక్షలు ఉండేలా ప్రభుత్వం షెడ్యూల్‌ను విడుదల చేసింది. సంవత్సరం అంతా కష్టపడి చదివినా శ్రమవృథా కాకుండా ఉండాలంటే రాబోయే కాలాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. విద్యార్థులు టైమ్ టేబుల్ రూపొందించుకొని చదివితే మంచి మార్కులు సాధించ వచ్చని, చదువుతో పాటు తగిన నిద్ర, విశ్రాంతి అవసరమని చెబుతున్నారు. 10వ తరగతి విద్యార్థుల కోసం ఆయా సబ్జెకుల ఉపాధ్యాయుల సూచనలు ఇలా ఉన్నాయి.

చిత్రాలపై సాధన చేయాలి



భౌతిక శాస్త్రం 50 మార్కులకు ఉంటుంది. 17 ప్రశ్నలకు జవాబులు రాసేందుకు సమయం రెండు గంటలు. ఒక మార్కు ప్రశ్నలు ఎనిమిది ఉంటాయి. రెండు మార్కుల ప్రశ్నలు మూడు, నాలుగు మార్కులు మూడు ఉంటాయి. 12వ ప్రశ్నకు డయాగ్రమ్‌కు చాయిస్ ఉంటుంది. ఎనిమిది మార్కుల ప్రశ్నకు అంతర్గత చాయిస్ ఉంటుంది. ఆమ్లాలు, క్షారాల యందు చాయిస్‌తో కలిపి తొమ్మిది మార్కులకు ఉంటుంది. విద్యుత్, మానవుని కన్ను, అందమైన ప్రపంచం యూనిట్‌లో ఎనిమిది మార్కులకు చా యిస్ ఉంటుంది. రసాయన చర్యలు, సమీకరణాల, సమ్మేళనాల్లో ఎనిమిది మా ర్కులకు చాయిస్ ఉంటుంది. విద్యుత్ ఐస్కాంత యూనిట్, లోహాలు, లోహాలకు సంబంధించి ఎనిమిది మార్కులకు చాయిస్ ఉంటుంది.

-సొప్పర కమలాకరరావు, ఫిజిక్స్ ఉపాధ్యాయుడు, జడ్పీహెచ్ఎస్ వెన్నాదేవి

ఆంగ్లపై ఆందోళన వద్దు



ఆంగ్ల మంటే అందరూ ఆందో ళన పడుతుంటారు. అర్థం చేసుకుంటూ చదివితే చాలా సులభం. ఆంగ్ల పరీక్ష పేపరు మూడు భాగాలుగా ఉంటుం ది. సెక్షన్ ఏలో రీడింగ్, కాంప్రెహెన్షన్ 30 మార్కుల్లో 24 బహుళైచ్ఛిక ప్రశ్నలు ఉంటాయి. ఆరు మార్కు లకు సాధారణ ప్రశ్నలు ఉంటాయి. ఒకటి నుంచి 15, 16, 17 ప్రశ్నలపై దృష్టి సారిస్తే మార్కులు సులువుగా వస్తాయి. సెక్షన్ - బీలో వకాబులరీ గ్రామర్ 40 మార్కులకు ఉంటుంది. మొత్తం పా ఠ్యాంశాలు బాగా చదివితే 18 నుంచి 34వ ప్రశ్న వరకు సమాధానాలు రాసి మార్కులు సాధించవచ్చు. సెక్షన్ - సీలో 30 మార్కుల్లో 35వ ప్రశ్న డైరీ రైటింగ్, 36 ప్రశ్న లెటర్ రైటింగ్, 37వ ప్రశ్న పేరగ్రాఫ్ రైటింగ్ ఉంటాయి. క్రియేటీవ్, లెటర్ రైటింగ్, కన్వర్షన్, బయోగ్రఫీ ప్రశ్నలపై సాధన చేయాలి.

-బిల్లా పద్మ, స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీషు), జెడ్పీహెచ్ఎస్ గరల్స్, సత్తెనపల్లి

సులభంగా తెలుగులో మార్కులు



తెలుగులో మంచి మార్కులు సాధించుకోవటం విద్యార్థుల చేతుల్లోనే ఉంటుంది. చక్కటి రాత, అక్షర దోషాలు, కొట్టి వేతలు లేకుండా జాగ్రత్త పడాలి. అవగాహన ప్రతి స్పందనకు 32 మార్కులు, వ్యక్తీకరణ సృజనాత్మకతకు 36 మార్కులు, భాషాంశాలకు 32 మార్కులు ఉంటాయి. పద్యంశాల నుంచి నాలుగు ప్రశ్నలు ఇస్తారు. వాటిని చదివి ఒక వాక్యంలో సమాధానం రాస్తే నాలుగు ప్రశ్నలకు ఎనిమిది మార్కులు వస్తాయి.

- మోదుకూరి భరత మాణిక్య జోత్స్న, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, ఆర్‌కే పురం

రెక్కల కష్టమే...

ఆమెకు ఆక్సిజన్



ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడేది ఆక్సిజన్. ఆ సిలిండర్లు మోయగా వచ్చే డబ్బు సంపాదనే ఆమె కుటుంబానికి ఆక్సిజన్ వంటిది.పెదకాకాని బైపాస్ వద్ద ఒక మహిళ కుటుంబ పోషణ కోసం కష్టపడుతున్న దృశ్యం ఇది.

-గుంటూరు, ఆంధ్రజ్యోతి

ఎమ్మెల్సీ ఎన్నికలను
పారదర్శకంగా నిర్వహించాలి

● ఎలక్షన్ అబ్జర్వర్ కరుణ

గుంటూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఎలక్షన్ అబ్జర్వర్, సీనియర్ ఐఏఎస్ అధికారి వీ కరుణ ఆదేశించారు. సోమవారం ఆమె తొలిసారిగా ఎన్నికల పరిశీలనకు కలెక్టరేట్‌కు వచ్చారు. నామినేషన్ల ప్రక్రియని పరిశీలించి రిటర్నింగ్ అధికారి ఎస్ నాగలక్ష్మితో సమావేశమై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎలక్షన్ కోడ్‌ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. నామినేషన్ల పరిశీలన సజావుగా పూర్తి చేయాలని, ఆ తర్వాత బ్యాలెట్ పేపర్ ముద్రణ, బాక్సులను సంసిద్ధం చేయడం వంటివన్నీ నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు.

ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరి

ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో ప్రచారం చేసుకునేందుకు అనుమతులు తీసుకోవాలని ఆర్వో నాగలక్ష్మి స్పష్టం చేశారు. అభ్యర్థులకు అవసరమైన దరఖాస్తులను కలెక్టరేట్ నుంచి పొందవ చ్చన్నారు.



కలెక్టరేట్‌కు వచ్చిన ఎన్నికల పరిశీలకురాలు వీ కరుణకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న ఆర్వో నాగలక్ష్మి

పోలీసుల అదుపులో మూడు ఇసుక లారీలు

తుళ్లూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఇసుక లారీలు మూడింటిని తుళ్లూరు పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. లింగాయపాలెం స్టాక్ పాయింటు ఉండి సోమవారం ఇసుకను తీసుకెళుతున్నారు. గుంటూరు నవభారత్‌నగర్‌లోని సీసీ రోడ్ల ప్రభుత్వ పనులకు ఈ ఇసుక వెళుతున్నది. అయితే బాడీ పైకి ఓవర్ లోడుతో వెళుతుండటంతో పోలీసులు గమనించి అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు. ఓవర్ లోడుతో అనర్థాలుంటాయని, కనుక లారీలు, ట్రాక్టర్లతో ఇసుక తీసుకెళ్లే వారు ఇది గమనించాలని సీఐ ఈ సందర్భంగా కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని లేమల్లెపాడు గ్రామంలోని కాలనీకి చెందిన సరిపూడి సంజయ్ (18) స్వల్ప కారణంతో జనవరి 14న పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గుర్తించిన స్నేహితులు, కుటుంబసభ్యులు వెంటనే గుంటూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా తగ్గిందని ఇంటికి తీసుకువచ్చారు. ఈనెల 5వ తేదీన తిరిగి సంజయ్ తీవ్ర అనారోగ్యానికి గురికావటంతో గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందినట్టు వట్టిచెరుకూరు పోలీసులకు సమాచారం అందింది. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరచగా వట్టిచెరుకూరు పోలీసులు కేసు నమోదు చేసి మంగళవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అందజేస్తామని వెల్లడించారు. అతడి తండ్రి సరిపూడి శంకర్ వ్యవసాయకూలీగా పని చేస్తుంటాడు.

అన్నదాన ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వార్ల అన్నదాన ట్రస్టు ఆహ్వాన పత్రికలను సోమవారం ఆవిష్కరించారు. ట్రస్టు చైర్మన్ వాకా మంగారావు మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీన మహాశివరాత్రి పర్వదినం మర్నాడు స్వామివారి దివ్య రథోత్సవం సందర్భంగా వేలాది మంది భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, గుంటూరు-1 బ్రాంచ్ వారి సూచనలు పొంది యిందుమూలముగా యావన్మందికి తెలియ చేయునది ఏమనగా... **షేక్ పెదఫర్దీన్** గారి భార్య **షేక్ షహీన** గారి ఆస్తిని తనఖా పెట్టుకొని **షేక్ పెదఫర్దీన్** గారు ఋణము పొందుటకు సంప్రదించినారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు, క్లెయిములు ఉన్నచో 7 రోజులలోపు తెలియచేయవలయును. ఎట్టి అభ్యంతరములు, క్లెయిములు రానిచో మా క్లయింట్ సదరు **షేక్ పెదఫర్దీన్** గారికి ఋణం మంజూరు చేయును. **షెడ్యూలు** : గుంటూరు డి. చేబ్రోలు సబ్.డి., చేబ్రోలు గ్రామ పంచాయితీలోని చేబ్రోలు గ్రామం తాలూకు డి.నెం. 326/1బిరు బాపతు 8వ బ్లాకు, డోర్ నెం. 8-110రుకు ప్రక్కన గల నీకు దక్షిణ పరచిన ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు **తూర్పు** : షరీఫ్ బేగ్ గారి ఆస్తి హద్దు, **దక్షిణం** : నడవ కొంత, షేక్ మీరావలి గారి ఆస్తి కొంత హద్దు, **పడమర** : హైదర్ బేగ్ గారి ఆస్తి కొంత, నా తాలూకు అనగా షేక్ పెద్ద ఫర్దీన్ గారి ఆస్తి కొంత హద్దు, **ఉత్తరం** : డొంక హద్దు, ఈ నాలుగు హద్దుల మధ్య చ.గ. 109లకు సరియగు చ.మీ. 91.13ల్లో ఖాళీ నివేశన స్థలం మాత్రం. DOC NO: 220/2022, S.R.O. చేబ్రోలు.

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీక్రిష్ణ,
న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు.
సెల్ నెం.9030595227, 9848052914

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, గుంటూరు-1 బ్రాంచ్ వారి సూచనలు పొంది యిందుమూలముగా యావన్మందికి తెలియ చేయునది ఏమనగా... **అత్మకూరి ప్రభాకరరావు** గారి కుమారుడు **అత్మకూరి నాగ వెంకట పవన్ కుమార్** గారి ఆస్తిని తనఖా పెట్టుకొని ఋణము పొందుటకు సంప్రదించినారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు, క్లెయిములు ఉన్నచో 7 రోజులలోపు తెలియచేయవలయును. ఎట్టి అభ్యంతరములు, క్లెయిములు రానిచో మా క్లయింట్ సదరు **అత్మకూరి నాగ వెంకట పవన్ కుమార్** గారికి ఋణం మంజూరు చేయును. **షెడ్యూలు** : గుంటూరు డి., పెదకాకాని సబ్ డి., యిలాకా మంగళగిరి మండలం, కాజ గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన కాజ గ్రామం తాలూకు డి.నెం. 224/7ఎ రు య. 4-83 సెంట్లు విస్తీర్ణములో, య. 1-30 సెంట్లలో వేయబడిన ప్లాట్లలో ప్లాను దాఖలా మాకు హక్కు కలిగిన ప్లాటు నెం. 266, 267ల్లు దాఖలా చ.గ. 408-8లు స్థలములో ఈ రోజున మీకు నేను విక్రయించిన ప్లాటు నెం. 266రు బాపతు చ.గ. 204-4లు స్థలమునకు హద్దులు **తూర్పు** : అ. 33లు వెడల్పు గల రోడ్డు హద్దు అ. 40-00లు, **దక్షిణం** : కాల్లగడ్డ రంగయ్య గారి భూమి హద్దు అ. 46-00లు, **పడమర** : ప్లాటు నెం. 277రు బాపతు స్థలం హద్దు అ. 40-00లు, **ఉత్తరం** : ఈ రోజున మాచే క్రయం పొందుచున్న ప్లాటు నెం. 267రు బాపతు షేక్ మాబు సుభాని గారి స్థలం హద్దు. ఈ హద్దుల మధ్య చ.గ. 204-4లు లేక చ.మీ. 170-90ల్లో ఖాళీ నివేశన స్థలము. DOC NO: 864/2018, S.R.O. పెదకాకాని.

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీక్రిష్ణ,
న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు.
సెల్ నెం.9030595227, 9848052914

క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం

● సీనియర్ డిప్యూటీ ఎకౌంటెంట్ జనరల్ భాస్కర్ కల్లూరి
● ఐఏ అండ్ ఏడీ ఉద్యోగుల క్రికెట్ టోర్నీ ప్రారంభం
● తొలిరోజు కేరళ, తమిళనాడు జట్ల గెలుపు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నిత్యం విధుల్లో నిమగ్నమై ఉంటున్న ఉద్యోగులకు క్రీడలతో ఆటవిడుపు లభించడంతోపాటు మానసిక, శారీరక దృఢత్వం పెంపొందుతుందని విజయవాడ ఆడిట్ జనరల్ కార్యాలయం సీనియర్ డిప్యూటీ ఎకౌంటెంట్ జనరల్ భాస్కర్ కల్లూరి అన్నారు. మంగళగిరిలోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో ఐఏ అండ్ ఏడీ సౌత్‌జోన్ క్రికెట్ టోర్నమెంటు-2025 సోమవారం ప్రారంభమైంది. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల జట్ల తరఫున సుమారు 80 మంది క్రీడాకారులు విచ్చేశారు. ఆడిట్ జనరల్ కార్యాలయం సీనియర్ డిప్యూటీ ఎకౌంటెంట్ జనరల్స్ భాస్కర్ కల్లూరి, కిశోర్‌రెడ్డి, ఆర్ శ్యామ్, రాకేష్ నాయక్, ఎన్ నిఖిలలు జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ విజయవాడలోని ప్రిన్సిపల్ ఎకౌంటెంట్ జనరల్ కార్యాలయం నేతృత్వంలో తొలిసారిగా సౌత్‌జోన్ క్రికెట్ టోర్నీ నిర్వహించడం



జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న సీనియర్ డిప్యూటీ ఎకౌంటెంట్ జనరల్ భాస్కర్ కల్లూరి

సంతోషకరమన్నారు. ఇందుకు మంగళగిరి అంతర్జాతీయ స్టేడియం అద్భుతమైన వేదికగా నిలిచిందన్నారు. మంగళగిరి స్టేడియంకు అప్రోచ్ రోడ్ల నిర్మాణం చేపడితే మరింత సౌకర్యవంతంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర విభజన అనంతరం తొలిసారి ఏపీలో ఈ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ టోర్నీలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు రంజీ, ఐపీఎల్ వంటి టోర్నీల్లో పాల్గొనే అవకాశం దక్కుతుందన్నారు.

తొలిరోజు ఆంధ్రప్రదేశ్ - తెలంగాణ, కేరళ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కేరళ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. ఏపీ-తెలంగాణ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 96 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కేరళ జట్టు 18.3 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 100 పరుగులు చేసి విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో తమిళనాడు, కర్ణాటక జట్లు తలపడ్డాయి. తమిళనాడు జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. కర్ణాటక జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తమిళనాడు జట్టు ఆఖరి బంతి వరకు పోరాడి 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవం

● విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవం సందర్భంగా ఎంటీఎంసీ పరిధిలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. వీవర్స్ కాలనీలోని మున్సిపల్ హైస్కూల్లో ఎంటీఎంసీ అదనపు కమిషనరు శకుంతల మాత్రల పంపిణీని ప్రారంభించారు. ఎంటీఎంసీ పరిధిలో మొత్తం 51,146 మందికి మాత్రలను పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్త్ అండ్ ఇమ్యునైజేషన్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అర్జునరావు, డాక్టర్ అనూష, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



మంగళగిరిలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న అదనపు కమిషనర్ శకుంతల

మండలంలో 9,248 మందికి మాత్రల పంపిణీ

దుగ్గిరాల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల లోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు అల్బెండజోల్ మాత్రలను సోమవారం పంపిణీ చేశా రు. ఎంఈవో కాజ శ్రీనివాసరావు, హెచ్‌ఎం ఎస్ శోభాదేవి, దుగ్గిరాల పీహెచ్‌సీ డాక్టర్ రెహ్మాన్ తది తరుల చేతుల మీదుగా అల్బెండజోల్ మాత్రలను విద్యార్థినులతో మింగించారు. ఎంపీడీవో అడిగొప్పుల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆరునెలలకొకసారి మా త్రలను వేసుకోవడం ద్వారా పిల్లల్లో నులిపురుగుల ను నివారించవచ్చునన్నారు. మండలంలోని ప్రభు త్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో 9,248 మందికి నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్నట్లు చెప్పారు. హెల్త్ ఎడ్యుకేటర్ వంకదార సుబ్బారావు, ఎంఎల్‌హెచ్‌పీ బుజ్జి, ఏఎన్ఎం శ్యామల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదనందిపాడు (ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నివారణకు కృషిచేద్దామని వైద్యాధికారి లావణ్య అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా మండలపరిధిలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు ముద్దన శ్రీనివాసరావు, పి.జాకబ్, సూపర్‌వైజర్ చెన్నయ్య, ఆశ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

● **ఫిరంగిపురం (ఆంధ్రజ్యోతి):** పిల్లలందరికీ నులి పురుగుల నివారణ కోసం మాత్రలు వేయాలని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ఫరీనా బేగం అన్నారు. మండలంలోని వేమవరం గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో డాక్టర్ బేగం చిన్నారులకు ఆల్బెండాజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు కొండపల్లి సుదర్శనరాజు తదితర వైద్యాధికారు లు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఆలపాటిని భారీ మెజార్టీతో గెలిపించాలి

● టీడీపీ నేతలు



పట్టభద్రులను కలిసి కరపత్రాలు అందజేసిన టీడీపీ నేతలు

మంగళగిరి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని టీడీపీ నేతలు కోరారు. టీడీపీ నేతల బృందం సోమవారం మంగళగిరి పట్టణం, మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. గ్రాడ్యుయేట్ ఓటర్ల వద్దకు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. నేతలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడు నెలల కాలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని ఆలపాటికి మొదటి ప్రాధాన్య ఓటును వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మీనరసింహ గోల్డ్‌స్మిత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష, కార్య దర్శులు గుంటి నాగరాజు, గాజుల శ్రీనివాసరవు, అందె మురళీ పాల్గొన్నారు.

● తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరుతూ నియోజకవర్గ పరిశీలకులు ముమ్మడి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు ఆధ్వర్యంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్ ఓటర్లకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తాడిబోయిన భాస్కర్, కొర్రపాటి విజయ్, భాస్కర్, ప్రసాద్, దుర్గారావు, మల్లేశ్వరరావు, నాగేశ్వరరావు, గోపి, రంగా, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావును గెలిపించండి

తాడేపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ గుండిమెడలో సీపీ ఎం నేతలు విస్తృత ప్రచారం నిర్వహించారు. సీపీఎం రూరల్ మాజీ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి గుండిమెడలోని పట్టభద్రులను కలుసుకుని లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పల్లెకృష్ణ, నల్లపు కిషోర్, నాగపోలు విజయరాజు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విద్యుత్‌శాఖ అధికారుల తనిఖీలు

● 405 సర్వీసులకు 15.72లక్షల అపరాధ రుసుం

పెదనందిపాడు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఆయా గ్రామాల్లో సోమవారం విద్యుత్‌శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బాపట్ల విద్యుత్‌శాఖ ఎస్ఈ జి.ఆంజనేయులు, విజిలెన్స్ అధికారి పీవీఆర్ మల్లికార్జునరావుల ఆధ్వర్యంలో 35 బృందాలు 1176 గృహ సర్వీసులు, 5 వాణిజ్య సర్వీసులు, 2 పరిశ్రమల సర్వీసులను తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో అనుమతించిన లోడు కంటే అదనపులోడు వాడుతున్న 405 సర్వీసులకు 15.72లక్షల నగదు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా అనధికారికంగా విద్యుత్‌వాడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బాపట్ల విద్యుత్‌శాఖ ఎస్ఈ జి.ఆంజనేయులు, పొన్నూరు ఆపరేషన్ ఏడీఈ శ్యామ్‌కుమార్, ఏఈ వీరాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిరంగిపురం జట్టుకు ద్వితీయ స్థానం



చీరాలలో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ద్వితీయ స్థానం పొందిన ఫిరంగిపురం జట్టు

ఫిరంగిపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆదివారం చీరాలలో జరిగిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఫిరంగిపురంనకు చెందిన సీఎఫ్‌సీ జట్టు ద్వితీయ స్థానం పొంది కప్పును కైవసం చేసుకుందని ఫిరంగిపురం సీఎఫ్‌సీ జట్టు సభ్యులు సోమవారం తెలిపారు.

రాష్ట్ర స్థాయిలో కంతేరు జడ్పీ పాఠశాల విద్యార్థి ప్రతిభ

తాడికొండ(కంతేరు), ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కంతేరు గ్రామంలోని జడ్పీ పాఠశాల విద్యార్థి రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన కాలిగ్రాఫ్ చేతిరాత పోటీల్లో ప్రతిభ కనబరిచిందని పాఠశాల ప్రధానోపాధ్యాయిని టీ పద్మావతి పేర్కొన్నారు. సోమవారం పాఠశాలలో విద్యార్థిని మమతను అభినందించారు. విద్యార్థిని మమతను, గైడ్‌గా వ్యవహరించిన ఉపాధ్యాయులు ఏ వెంకటరెడ్డిని టీడీపీ సీనియర్ నాయకులు వాసిరెడ్డి జయరామయ్య, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ ఏ విజయ్‌లు అభినందించారు.

పేదలకు శాశ్వత ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి ప్రాంతంలో ఇళ్లు లేని పేదల నుంచి స్వీకరించిన అర్జీలను సోమవారం సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య, సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య పేదలతో కలిసి తాడేపల్లి 6వ సచివాలయంలో సమర్పించారు. ఈ సందర్భంగా కాశయ్య మాట్లాడుతూ తాడేపల్లిలో రైల్వే ఫారెస్ట్ పిడబ్ల్యుడి, కొండ పోరంబోకు భూముల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారని అన్నారు. రైల్వే, ఫారెస్టు, ఇరిగేషన్, కొండ పోరంబోకు స్థలాల్లో నివసిస్తున్న వారందరికీ ఎక్కడి వారికి అక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసి శాశ్వత పట్టాలు ఇవ్వాలని కోరారు. అలాగే గతంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ చెప్పినట్టు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఐదు రూ.లక్షలు ఇల్లు కట్టు కోవడానికి ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.

నివేశన స్థలాలు కేటాయించాలంటూ అర్జీలిచ్చిన మహిళలు

దుగ్గిరాల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నిలువ నీడలేని పేదలకు 3 సెంట్ల చొప్పున నివేశనస్థలాలు కేటాయించాలని మంగళగిరి నియోజక వర్గ సీపీఐ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు అన్నారు. తుమ్మపూడిలోని గ్రామ సచివాలయం, దుగ్గిరాల తహసీల్దార్ కార్యాలయాల వద్దకు చేరుకున్న పేద మహిళలను కలిసి ఇళ్ల స్థలాల సమస్య పై మాట్లాడారు. తహసీల్దార్ ఐ సునీతకు, గ్రామ కార్యదర్శులకు 150 మందికి పైగా మహిళలు అర్జీలిచ్చారు. సీపీఐ నేతలు యార్లగడ్డ శివయ్య, రమేష్, కరీముల్లా, నాలాది జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర పేరేడ్‌కు హాజరైన విద్యార్థినులకు అభినందన

తాడేపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గత నెల 26న ఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని పెరేడ్ నిర్వహించిన కేఎల్ డీమ్డ్ యూనివర్సిటి ఎన్‌సీసీ విద్యార్థినులను ఇన్‌చార్జి వీసీ రాజశేఖరరావు, డీన్ డాక్టర్ ప్రసాద్, పావని తదితరులు అభినందించారు. ఎన్‌సీసీ 22 ఆంధ్రా బెటాలియన్‌కు చెందిన ఆర్ మాన్యశ్రీ, కేఎల్‌యూలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ తృతీయ సంవత్సరం చదువుతుండగా 10 ఆంధ్రా బెటాలియన్‌కు చెందిన అప్పికట్ల దీప్తి బిటెక్ కంప్యూటర్ సైన్స్ ఆనర్స్ తృతీయ సంవత్సరం చదువుతుందన్నారు. కాగా దీప్తి ఢిల్లీలో పెరేడ్ అనంతరం రాష్ట్రపతి ముర్ము సమక్షంలో వీణ వాయించి ప్రశంసలు పొందినట్టు తెలిపారు.

నూరుశాతం ఉత్తీర్ణతే ధ్యేయం : ఎంఈవో కెన్నడీ

కాకుమాను, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పది పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణతే ధ్యేయం అని ఎంఈవో కేఎఫ్ కెన్నడీ అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం పది విద్యార్థులకు సెమీ ఫైనల్ పరీక్షల తీరును ఎంఈవో-2 కేవీ భాస్కరరావుతో కలసి పరిశీలించారు. పాఠశాలకు హాజరయ్యే ప్రతివిద్యార్థి పరీక్షలకు హాజరవ్వాలని ఆదేశించారు. అనంతరం పాఠశాలలో ప్రధాని మోదీ పరీక్షా పే చర్చా కార్యక్రమంలో విద్యార్థులతో కలసి పాల్గొన్నారు. అనంతరం జాతీయ నులుపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో యుగకీర్తి విద్యార్థులకు అల్బెండోజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యం, ఈవోపీఆర్డీ రవిబాబు, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనదారులకు కౌన్సెలింగ్

తాడేపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీస్ (సీఈఏ) ఆధ్వర్యంలో వడ్డేశ్వరం బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ నియమాలు తెలుపుతూ ఎస్ఐ నారాయణ ద్విచక్రవాహన దా రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ట్రాఫిక్ నియమాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి వీసీ కే రాజశేఖరరావు, ప్రోవీసీలు ప్రసాద్, వెంకట్రావు, రిజిస్ట్రార్ కే సుబ్బారావు, డీన్ కేఆర్ఎస్ ప్రసాద్, అసోసియేట్ డీన్ శ్రీధర్, సీఈఏ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, సెక్యూరిటి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు గుంటూరు జిల్లా, మంగళగిరి టౌన్, కాంధ్రు వారి వీధి, డోర్.నెం. 8-98-ఎ1రు కాపురస్థురాలు **దామర్ల వెంకటరమణ W/o దామర్ల తిరుపతిరావు** (ఆధార్.నెం.4100 4774 8588) గారి సంజాయిషీ పొంది యావన్మందికి ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా...

నా క్లయింటు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని **పడవల రాజశేఖర్** గారి భార్య **పడవల ప్రభావతి** గారి నుండి కొనుగోలు చేసి విక్రయ అగ్రీమెంటు పొందియున్నారు, సదరు పడవల ప్రభావతి గారు దామర్ల శ్రీనివాసరావు వగైరాల వలన క్రయంపొంది ది.**18.11.2009**వ తేదీన ద.నెం.**5835/2009**రుగా రిజిస్ట్రేషన్ పొందియున్నారు, ఈ దస్తావేజునకు రెండు వీలునామా లింకు దస్తావేజుల నెం. **81/1989,** నెం. **148/2006**ల్లు అయివున్నది, సదరు వీలునామా అంశముల ప్రకారం దామర్ల శ్రీనివాసరావు గారి తల్లిదండ్రుల అనంతరం దామర్ల శ్రీనివాసరావుకు సంక్రమించి వున్నది. కాని వారి తల్లిదండ్రుల డెత్ సర్టిఫికెట్లు తీసుకొనియుండలేదు, సదరు ఆస్తిని దామర్ల శ్రీనివాసరావు వగైరాలు మాత్రమే పూర్తి హక్కుదారులనియు వేరే హక్కుదారులు లేరనియు తెలియజేసియున్నారు, తదుపరి దామర్ల శ్రీనివాసరావు వగైరాలు పడవల ప్రభావతి గారికి విక్రయం చేసియున్నారు. షెడ్యూలు ఆస్తి పడవల రాజశేఖర్ గారి భార్య పడవల ప్రభావతి గారి సంపూర్ణ, స్వాధీన హక్కుభుక్తములలో ఉన్నవని సదరు ఆస్తి నిర్వివాద ఆస్తి అనియు నా క్లయింటును నమ్మించియున్నారు. నా క్లయింటు విక్రయ దస్తావేజు పొందబోవుచున్నారు మరియు సదరు విక్రయ దస్తావేజు ద్వారా ఏదైన నేషనలైజ్డ్ బ్యాంకు, ప్రైవేటు బ్యాంకు, ఇతర ఋణ సంస్థల నుండి గానీ, వ్యక్తుల నుండి గాని ఋణమును పొందగోరుచున్నారు. సదరు ఆస్తి యొక్క విక్రయం పైన ఎవరికైన ఎటువంటి అభ్యంతరములు ఉన్ననూ ఈ బహిరంగ ప్రకటన తేదీ నుండి వారం రోజులలోగా నాకు లిఖితపూర్వకముగా తెలియజేయవలెను. తదుపరి క్లెయిములు నా క్లయింటును గాని సదరు ఋణదాతలైన నేషనలైజ్డ్ బ్యాంకు, ప్రైవేటు బ్యాంకు, ఇతర ఋణ సంస్థలను గానీ, వ్యక్తులను గాని బైండు చేయజాలవు. **షెడ్యూలు** : గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్.డి.యిలాకా, మంగళగిరి మునిసిపల్ ఏరియా, మంగళగిరి గ్రామం తాలూకు దస్తావేజు దాఖలా డి.నెం.235రులో చ.గ.110లు ఆస్తికి గాను మునిసిపల్ సర్వేయర్ ఎండార్స్మెంట్ దాఖలా సర్వే.నెం.234, 235, 236-1రు దాఖలా మంగళగిరి మునిసిపల్ డోర్. నెం. 8-111రు గల చ.గ.108.22లు ఆస్తికి హద్దులు: **తూర్పు:** దామర్ల శ్రీనివాసరావు గారి ఆస్తి హద్దు అ.36.0లు, **దక్షిణం:** మునిసిపల్ రోడ్ హద్దు అ.25.2 3/4లు, **పడమర:** గోలి రాజేష్ గారి స్థలం హద్దు అ.41.0లు, **ఉత్తరం:** మునిసిపల్ గల్లీ బజారు హద్దు అ.25.2 3/4లు.

డి. వంశీకృష్ణ, అడ్వకేట్, డోర్.నెం.5-500 బి 77 (1),
అంజనేయ కాలనీ, బైపాస్ సర్వీస్ రోడ్, మంగళగిరి, గుంటూరు జిల్లా.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

రేపు దంత, నేత్ర వైద్య శిబిరాలు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): బీసీ కాలనీలోని కళాకారుల సంఘ భవనంలో బుధవారం ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ వైకుంఠపురం, ఈదర రామారావు ట్రస్ట్, పట్టణ రంగస్థల కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఈ శిబిరాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కళాకారులంతా ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, శిబిరంలో చికిత్సలు అవసరమైన వారిని గుర్తించి చికిత్స చేయిస్తామని, కుటుంబ సభ్యులంతా శిబిరంలో వైద్య సాయం పొందవచ్చన్నారు. మంగళవారం బీసీ కాలనీలోని సంఘ భవనంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. బుర్రా జయలక్ష్మి, ఈదర వెంకటపూర్ణచంద్, ఈదర శ్రీనివాసరావు, మురళీకృష్ణ, సుబ్బారావు, సింగారావు, ఆదినారాయణ, భవానీ, వెంకటరత్నం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కొల్లిపర హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి విజయరాజు

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎన్నికల అధికారి

కొల్లిపర, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల సందర్భంగా సోమవారం మండల కేంద్రం కొల్లిపర హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన మూడు ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారి, ఇరిగేషన్ జేఈ విజయరాజు పరిశీలించారు. కొల్లిపర మండల పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో 2వేల 579 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. దీంతో కొల్లిపరలోని మూడు పోలింగ్ కేంద్రాల నిర్వహణ ఏర్పాట్లను ఎన్నికల అధికారి పరిశీలించి పోలింగ్ కేంద్రాల్లో తగిన వసతుల కల్పనపై స్థానిక అధికారులతో చర్చించారు. పోలింగ్ బూత్‌లను పరిశీలించిన వారిలో ఎన్నికల అధికారితో పాటుగా ఏఎస్ఐ పోతురాజు, వీఆర్వో భాస్కరరావు తదితరులు ఉన్నారు.



స్వాధీనం చేసుకున్న బియ్యం ఆటో

రేషన్ బియ్యం స్వాధీనం

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని సోమవారం త్రీటౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సుల్తానాబాదులోని మునిసిపల్ పాఠశాల వెనుక ప్రాంతంలో, ఒక ఇంటిలో అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని నిల్వ ఉంచారన్న సమాచారంతో పోలీసులు తనిఖీలు చేశారు. సుమారు 29 బస్తాల్లో 1085 కేజీల బియ్యం ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో రాజు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యోగా శిక్షకుల నియామకానికి దరఖాస్తు చేసుకోవాలి

● వైద్యాధికారి సాయికుమార్

కొల్లిపర, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ మందిర్, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల మున్నంగిలో యోగా శిక్షకులుగా పని చేయటానికి ఆసక్తి కలిగిన స్త్రీ, పురుషుల నుంచి దరఖాస్తు చేసుకోవాలని మండల ఆయుర్వేద వైద్యాధికారి సాయికుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మున్నంగి ఆయుర్వేద వైద్యశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యోగాలో డిగ్రీ లేదా డిప్లొమా చేసి అనుభవం కలిగిన అభ్యర్థులకు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 9391399194ను సంప్రదించాలన్నారు. అనంతరం మున్నంగి హైస్కూల్‌లో విద్యార్థులతో యోగా చేయించారు. యోగా వలన కలిగే ఉపయోగాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మాజీ మండల ఉపాధ్యక్షుడు కల్లం వెంకటప్పారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూటమి పార్టీల చర్యలు అభినందనీయం: మోసిగంటి

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 10: కూటమి పార్టీల నాయకులపై వస్తున్న ఆరోపణలపై ఆ పార్టీ అధినాయకులు అవలంభిస్తున్న క్రమశిక్షణ చర్యలు అభినందనీయం అని జీసెస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ జోసెఫ్ మోసిగంటి సోమవారం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కానీ నాయకులపై వచ్చిన ఆరోపణలు అవాస్తవాలు అని తేలేవరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని నాయకులను ఆదేశిస్తున్నారన్నారు. ఇలాంటి చర్యలు నాయకత్వ గొప్పతనంగా పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, కొలికపూడి శ్రీనివాస్, జనసేన నాయకులు జానీ మాస్టర్, కిరణ్ రాయల్ విషయంలో జరిగిందన్నారు. కానీ జగన్‌మోహన్‌రెడ్డి దళితులను చంపి డోర్ డెలివరీ చేసిన వారికి సాయంచేసి వెంటబెట్టుకు తిరుగుతున్నారని ఆరోపించారు. మహిళలతో బరితెగించి ప్రవర్తించిన అంబటి రాంబాబు, అవంతి శ్రీనివాస్, గోరంట్ల మాధవ్, దువ్వాడ శ్రీనివాస్ లాంటి వారిపై జగన్ రెడ్డి ఎటువంటి చర్యలు తీసుకోలేదని గుర్తుచేశారు. కూటమి పార్టీల అధినేతలు అవలంభిస్తున్న నాయకత్వ లక్షణాలను జగన్‌మోహన్‌రెడ్డి అలవరచుకోవాలని జోసెఫ్ మోసిగంటి సూచించారు.

కష్టాల్లో కొత్తిమీర రైతు

● పూర్తిగా పడిపోయిన ధర
● కిలో రూ.25 నుంచి రూ.5 కు..
● కూలి ఖర్చులు కూడా రావంటున్న రైతులు





కొత్తిమీరను పీకుతున్న కూలీలు, మార్కెట్‌కు పంపేందుకు ట్రేలలో ఉంచిన కొత్తిమీర

కొల్లిపర, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి సంవత్సరం అధిక లాభాలు గడిస్తున్న కొత్తిమీర రైతు నేడు నష్టాలకు గురై కష్టాల్లో కూరుకుపోయాడు. ఈ ఏడాది కొత్తిమీర ధర ఎన్నడూ లేని విధంగా పడిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. కొత్తిమీరకు నెల క్రితం ఉన్న డిమాండ్ ప్రస్తుతం లేదని రెండు నెలలు క్రితం ఖర్చులు పోను ఎకరానికి రూ.లక్ష రూపాయలు ఆదాయం రాగా, ప్రస్తుతం కనీసం కూలి, రవాణా ఖర్చులు కూడా రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెనాలి డివిజన్‌లో దుగ్గిరాల, కొల్లిపర, కొల్లూరు మండలాల్లోని రైతులకు కొత్తిమీర సాగుపై అధిక ఆదాయం కనిపించింది. అందుకే ఎక్కువ మంది కొత్తిమీర సాగుకే మొగ్గు చూపారు. వెనుకాడకుండా పెట్టుబడులు పెట్టారు. ఈ పంట 40 రోజుల్లో చేతికొస్తుంది. ఎకరానికి కౌలు, పెట్టుబడి, కూలి, రవాణా ఖర్చులు సుమారు రూ.లక్ష అవుతుంది. గతంలో మార్కెట్‌లో కిలో రూ.25 నుంచి రూ.30 వరకు ధర ఉండేది. మొత్తం ఖర్చులు పోను అతి తక్కువ కాలంలో రూ.లక్ష ఆదాయం పొందేవారు. ప్రస్తుతం మార్కెట్‌లో రైతు నుంచి కొనుగోలు చేసే కొత్తిమీర కిలో రూ.5 మాత్రమే ఉంది. దీంతో రైతులు త్రీవంగా నష్టపోతున్నారు. వచ్చిన కాడికి అమ్ముకోవడం తప్ప మరేం చేయలని స్థితిలో కొత్తిమీర రైతులు ఉన్నారు. కూలి, రవాణా ఖర్చులు కూడా రాకపోవటంతో కొంతమంది రైతులు పంటను తీసేస్తున్నారు. కొత్తిమీర ధర కనీసం కిలో రూ.20 ఉంటేనే తమకు గిట్టుబాటు అవుతుందని రైతులు చెబుతున్నారు.

కొలకలూరు ఎస్సీ కాలనీలో

తాగునీటిని పరిశీలించిన అధికారులు

● పాత పైప్‌లైన్‌కు కనెక్షన్ ఇస్తామన్న అధికారులు ● అభ్యంతరం చెప్పిన స్థానికులు



కాలువలో మురుగు పేరుకుపోయి ఉండటాన్ని ప్రశ్నిస్తున్న డీఎల్‌పీవో స్వరూపారాణి

తెనాలి రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలకలూరు ఎస్సీ కాలనీలో తాగునీరు కలుషితమవుతున్నాయంటూ ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. డీఎల్‌పీవో స్వరూపారాణి అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి సరఫరా అవుతున్న నీటిని పరిశీలించారు. ఆమె పర్యటించే సమయంలో పాత వాటర్ పైప్‌లైన్ల ద్వారా నీటి సరఫరా నిలిపివేయడంతో కొత్తగా వేసిన పైపులైన్ల నీటి శాంపిల్స్‌ను తీసుకున్నారు. పాత పైప్‌లైన్లలో మురుగునీటితో చేరి సరఫరా అవుతున్నాయని స్థానిక మహిళలు అధికారుల దృష్టికి తీసుకువచ్చే ప్రయత్నం చేశారు. కాగా వారు మహిళల మాటలను పట్టించుకోలేదు. కాలనీ డ్రెయిన్లలో మురుగు రోజుల తరబడి పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతుందని దోమల ఉత్పత్తిపెరిగిందని స్థానికులు ఫిర్యాదుచేయటంతో డీఎల్‌పీవో క్షేత్రస్థాయిలో పరిశీలించి గ్రామ కార్యదర్శిని నిలదీశారు. తక్షణమే కాలనీలో మురుగునీరు పారుదలకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాలనీలో పరిశుభ్రమైన నీరు అందించేలా చూడాలని డీఎల్‌పీవో దృష్టికి పలువురు తీసుకురాగా ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మతిన్ జల్‌జీవన్‌మిషన్ కింద నిధులు లేవని ఇప్పటికే కాలనీలో వేసిన కొత్తపైప్‌లైన్‌కు పాత పైప్‌లైన్‌ను కలిపి వాటి ద్వారా నీరు విడుదల చేస్తామని కాలనీవాసులకు తెలుపగా కాలనీ వాసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో పాత పైపులైన్లు మురుగు కాలువలో ఉండటంతో లీకులను గుర్తించే పరిస్థితిలేక సరఫరా నిలిచిపోయిన సమయంలో పైపు లైన్లలోకి మురుగునీరు చేరి రంగుమారి రావడంతో డయేరియా లక్షణాలతో కాలనీలో పెద్దఎత్తున మంచంపట్టారని వివరించారు. పాతపైపులైన్లను కొత్త కనెక్షన్‌కు కలిపితే అవికూడా కలుషితమయ్యే ప్రమాదం ఉందని కోట్ల రూపాయలతో వేసిన పైప్‌లైన్ నిరుపయోగంగా మారుతుందని వాపోయారు. పంచాయతీ నిధుల నుంచి పైపులైన్లకు కాలనీ వాసులు ప్రయత్నించాలని అధికారులు సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనూష, పంచాయతీ కార్యదర్శి జయదేవ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటికి ఘన విజయం చేకూర్చాలి

● వేమూరు నియోజకవర్గ నాయకులకు ఆనందబాబు దిశానిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను వేమూరు నియోజవర్గంలో ఘన విజయంతో గెలిపించుకునేలా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ హోటల్లో ఆనంద్‌బాబు వేమూరు నియోజవర్గ నాయకులతో రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌బాబు మాట్లాడుతూ కూటమి గెలుపునకు ఆలపాటి ఎంతో కృషి చేశారన్నారు. ఆనాటి వైసీపీ ప్రభుత్వ పాలనలో అవలంబించిన ప్రజావ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ ప్రజల మనిషిగా ఆలపాటి నిలిచారని గుర్తుచేశారు. ఆలపాటిని గెలిపిస్తే నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పెద్దల సభలో తన గళం వినిపించి వారికి మంచి జరిగేలా చూస్తారన్నారు. కూటమి బలపరిచిన ఆలపాటిని భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆనంద్‌బాబు కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ అబ్జర్వర్ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ మౌలానా, షేక్ ముస్తక్ అహ్మద్, పెద్దసంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శేషన్న తదితరులు

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ పంపిణీ చేశారు. స్థానిక మారీసుపేటలోని నల్లమోతు చెంచురామానాయుడు మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పట్టణ మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పాల్గొని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

● తెనాలి, మారీసుపేట: నులిపురుగుల నివారణపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం అన్నారు. సోమవారం పట్టణంలో వివిధ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వివిధ ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో జరుగుతున్న నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలకు రాని విద్యార్థులకు ఈ నెల 17వ తేదీన మాత్రలను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ మలేరియా సహాయ అధికారి చిరసాని ప్రభాకర రెడ్డి, సబ్ యూనిట్ అధికారులు వంగల పున్నారెడ్డి, అందె బాలచంద్రమౌళి, శ్రీకంఠ ఉమాకాంత్, శివగణేష్, జి.రవికుమార్, ఆరోగ్య పర్యవేక్షలు డి.మల్లేశ్వరావు, బి.మల్లేశ్వరావు, దీపాల శ్రీనివాసరావు, వేణుగోపాల్, భాషిద్, హెల్త్ సెక్రటరీలు షేక్ జంషద్ బేగం తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలులో...


చేబ్రోలు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శైలజ అన్నారు. మండల పరిధిలోని నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జాతీయ నులిపురుగులు నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. చేబ్రోలు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 700మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శైలజ మాట్లాడుతూ విద్యార్థులు ఆహారం స్వీకరించే ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రాయల సుబ్బారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏడుకొండలు, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొల్లిపరలో...

కొల్లిపర, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో ఝాన్సీలత అన్నారు. సోమవారం కొల్లిపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం కార్యక్రమం సందర్భంగా అధికారులు విద్యార్థులకు నులిపురుగు నివారణపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీలత మాట్లాడుతూ అంటువ్యాధుల బారినపడకుండా ఉండాలంటే విద్యార్థులు ఆరోగ్య సూత్రాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంట్రావు, ఏఎన్ఎం అనిత, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదకాకానిలో...

పెదకాకాని, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని పెదకాకాని పీహెచ్‌సీ పరిధిలో సోమవారం నిర్వహించారు. మండల పరిధిలో 15,166 మంది విద్యార్థులకు గాను 14,407 మందికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసినట్టు పెదకాకాని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఎం.వసంతరావు, ఎంఈవో శంకరరాజు, వైద్యాధికారి డాక్టర్ పి.ప్రవీణ దీప్తి, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కొల్లిపరలో నులిపురుగు మందు గురించి అవగాహన కలిగిస్తున్న అధికారులు

బాల్య వివాహాలు అనర్థదాయకం: ఎంఈవో

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు అనర్థదాయకమని ఎంఈవో శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్టణంలోని ఏఎస్ఎం జిల్లా పరిషత్ ఉన్నత (బాలికల), నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'బాల్య వివాహ వ్యతిరేక ప్రచారోద్యమం' వీధి నాటిక ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా బాల్య వివాహాల వలన కలిగే కష్ట, నష్టాలను నాటిక రూపంలో ప్రదర్శించారు. 2006 బాల్య వివాహాల నిరోధక చట్టం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో వెంకటరమణ, ప్రధానోపాధ్యాయులు, చైల్డ్ రైట్స్ ప్రతినిధులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పేదలకు నివేశన స్థలాలు మంజూరు చేయాలని ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టిన సీపీఐ నాయకులు

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలో భాగంగా కూటమి ప్రభుత్వం పేదలకు తక్షణమే నివేశన స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పేదలలో 90శాతం మంది దళితులు, గిరిజనులు, మైనార్టీలు, వెనుకబడిన తరగతుల వారేనన్నారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి సెంటు స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు మాత్రమే ఇచ్చారన్నారు. దీనివలన ఇంటి నిర్మాణం పూర్తికాక లబ్ధిదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామాలలో మూడు సెంట్లు నివేశన స్థలం మంజూరు చేయడంతో పాటు గృహ నిర్మాణ వ్యయం పెరిగినందున ఇంటి నిర్మాణానికి అందించే నగదు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు, దేవరకొండ శ్రీనివాస్, మహిళలు, పాల్గొన్నారు.



వీధుల్లో స్వామి వారి ఊరేగింపు

పంచముఖ ఆంజనేయస్వామికి

సూర్యప్రభ, చంద్రప్రభ వాహన సేవలు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): శ్రీసువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామికి సోమవారం సూర్యప్రభ, చంద్రప్రభ వాహన సేవలు నిర్వహించారు. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు జరిపారు. అలంకరించిన వాహనాలపై స్వామి అమ్మవార్లను పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ ఉదయం, సాయంత్రం జరిగిన వాహన సేవల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మంగళవారం మైనకా వాహన సేవ, గజవాహన సేవ, గరుడ వాహనసేవలు నిర్వహిస్తారు. అనంతరం స్వామి అమ్మవార్ల కల్యాణాన్ని కన్నుల పండువగా జరుపుతారు. భక్తులు కల్యాణాన్ని తిలకించి తరించాలని ఈవో శ్రీనివాసరెడ్డి కోరారు. అర్చకులు శ్రీనివాసమూర్తి, కిరణ్‌కుమార్, సురేష్, నాగమారుతి బృందం పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, రామారావు, బాలకృష్ణ, అనురాధ తదితర భక్త బృందాలు ఉత్సవాల్లో పాల్గొన్నాయి.

భూములు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

● తహసీల్దార్ జియావుల్ హక్

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 10: అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ జియావుల్ హక్ సోమవారం తెలిపారు. ఎంతోమంది నిరుపేదలకు లబ్ధిచేకూర్చేలా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. అర్హులైన వారు మీ సేవా కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకునే విధానాన్ని రెవెన్యూ శాఖ అందుబాటులో తీసుకువచ్చిందన్నారు. జీవో నెం.30ను అనుసరించి ఈ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. క్రమబద్ధీకరించిన పట్టాలను మహిళల పేరే జారీ చేస్తామన్నారు. 2019 అక్టోబరు 15ను ప్రామాణికంగా తీసుకుని ఆ తేదీ కంటే ముందు ఆక్రమణలో ఉన్న భూములను క్రమబద్ధీకరించనున్నట్లు చెప్పారు. 150గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరస్తారని రిజిస్ట్రేషన్ ఫీజు కూడా చెల్లించనవసరం లేదన్నారు. 300 గజాలలోపు ఆక్రమణలకు బేసిక్ ధరలో 15శాతం, రిజిస్ట్రేషన్ ధరలో 50శాతం, దారిద్రరేఖ దిగువన ఉన్న వారు చెల్లించాల్సి ఉంటుందన్నారు. గ్రామాలలో నెలకూ రూ.10 వేలు, పట్టణాలలో రూ.14వేలు లోపు ఆదాయం ఉన్న వారు మాత్రమే దీనికి అర్హులుగా చెప్పారు. అర్హత కలిగిన లబ్ధిదారుల జాబితాను ప్రభుత్వ కార్యాలయాలలో ప్రచురించి అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. అర్హులైన వారు తక్షణమే దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు.



కవి సోపాటి ప్రభాకర్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

కవి ప్రభాకర్‌కు బంగారు నంది అవార్డు

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 10: పొన్నూరు మండలం బ్రాహ్మణ కోడూరు గ్రామానికి చెందిన కవి, రచయిత సోపాటి ప్రభాకర్‌కు బంగారు నంది అవార్డు లభించింది. తెలుగుకళ రత్నాలు, సాంస్కృతిక సేవా సంస్థ ఈ నెల 9న హైదరాబాద్ చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో బంగారు నంది అవార్డు పురస్కార సభ నిర్వహించింది. సంస్థ జాతీయ కన్వీనర్ డి.ఉషారాణి యూవీ రత్నం ప్రభాకర్‌కు బంగారు నంది అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జగదీష్ రాజబాబు తదితర కవులు ప్రభాకర్‌ను సత్కరించి అభినందించారు.



ఆలయ శంకుస్థాపన పూజల్లో నిర్వాహకులు, భక్తులు తదితరులు

వైభవంగా ఆలయ నిర్మాణానికి భూమి పూజ

తెనాలి రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పెదరావూరు శ్రీమహావిద్యాపీఠం శ్రీఅభయహస్త సుబ్రమణ్యక్షేత్రంలో నూతనంగా నిర్మించతలపెట్టిన శ్రీలక్ష్మీగణపతి, శ్రీబాలాంబిక సమేత శ్రీసర్వహితేశ్వర స్వామివార్ల నూతన దేవాలయ సముదాయ నిర్మాణానికి భూమి పూజ వైభవంగా నిర్వహించారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి పూజాకార్యక్రమాలను క్షేత్ర నిర్వాహకులు చింతపల్లి సుబ్రహ్మణ్యశర్మ శాస్త్రయుక్తంగా నిర్వహించి శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి భక్తులు మాగంటి కాశీవిశ్వేశ్వరప్రసాద్ కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు పాలడుగు రమేష్, కుదరవల్లి రమేష్ బాబు, పి.సురేంద్ర, సుబ్రహ్మణ్య క్షేత్రం అర్చకులు శుభంశర్మ, నారాయణమూర్తి, లక్ష్మీనరసింహమూర్తి, సీహెచ్ విజయ్‌కుమార్‌లు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. పెద్దసంఖ్యలో పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

పశువుల్లో నైట్రేట్ ముప్పు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పశువులకు నైట్రేట్ విష ప్రభావం ముప్పు పొంచి ఉందని, ఈ విషయంపై పశుపోషకులు అవగాహన కలిగి ఉండాలని పశుసంవర్ధక శాఖ ఏడీఏ డాక్టర్ నాగిరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పశువులు తాగేనీటిలో, తినే మేతలో నైట్రేట్ మోతాదుకు మించి ఉన్నట్లు ఈ మధ్యకాలంలో చేసిన పరిశోధనలలో వెల్లడైందన్నారు. పశువుల మేత, అవితాగే నీటిలో నైట్రేట్ 100పీపీఎంలకు మించి ఉంటే అనేక అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. నైట్రేట్ అధికంగా తీసుకున్న పశువులు అరగంట నుండి 4 గంటల మధ్య తీవ్రమైన అనారోగ్య లక్షణాలకు గురవుతాయన్నారు. నీలి లేదా చాక్లెట్ గోధుమరంగు శ్లేష్మపొరలు ఏర్పడటం, శ్వాస తీసుకోనటంలో తేడా, శబ్దంతో కూడిన శ్వాస, నోటి నుండి లాలాజలం కారుట, తరుచూ మూత్రం పోయుట, పారుడు లక్షణాలు, ఉబ్బరం, వణుకు, అస్థిరముగా ఉండటం, కడుపు నొప్పి, బలహీనత, కోమా, చివరకు చనిపోయే పరిస్థితులు పశువుల్లో ఉత్పన్నమౌతాయన్నారు. పశువుల్లో పైన తెలిపిన లక్షణాలను గుర్తిస్తే నిర్లక్షం చేయకుండా దగ్గరలోని పశువైద్యులను సంప్రదించాలని డాక్టర్ నాగిరెడ్డి సూచించారు.